www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ


ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 62 | శుక్రవారం | 9 అక్టోబర్, 2026

ఏఐ దూరమే భారత్‌కు బలం



- ఏడాదిలో అదే భారత ఈక్విటీలకు సానుకూలతగా మారొచ్చు
- ఏఐ జోరు తగ్గితే భారత్ వైపు ప్రపంచ మూలధనం
- ప్రధాన ఆర్థిక సలహాదారు

7

రైతులకు బేడీలా?

- ప్రజా పాలన కాదు, ప్రజలను పీడించే పాలన
- రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి
- లేదంటే పెద్దుత్తున పోరాటం చేస్తాం: హరీశ్

2



జూరాల కాలువకు నీరొదిలిన
14మంది రైతులపై కేసు

- హెడ్ రెగ్యులేటర్ ధ్వంసం చేసి నీటిని విడుదల చేశారంటూ ఎఫ్ఐఆర్
- ప్రాజెక్టు డీఈఈ ఫిర్యాదుతో అమరచింత పోలీసుల చర్య
- రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు
- ప్రభుత్వ చర్యపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు

2

ఉప ఎన్నికలో నాపై పోటీ చేసి గెలవండి

- ఈ ఎన్నిక మా ప్రభుత్వ పాలనకు రెఫరెండం.. తాడోపేడో తేల్చుకుందాం
- కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సవాల్

2





ఉద్రిక్తంగా చలో లోక్‌భవన్

సేవ్ డెమోక్రసీ పేరుతో ఇండీ కూటమి భారీ ర్యాలీ

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

- మంత్రులు, పీసీసీ చీఫ్ సహా నేతల అరెస్టు
- బెంగాల్, బీహార్ తర్వాత టార్గెట్ తెలంగాణ
- బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు.. 92లక్షల ఓట్లు తొలగింపు
- ప్రజాస్వామ్యాన్ని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఖూనీ చేస్తున్నారు: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్

దేశవ్యాప్తంగా ఓటు హక్కును కాపాడుకోవడానికి ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రాహుల్ గాంధీ చేస్తున్న నిరసనకు మాతో పాటు దేశంలోని ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. వెంటనే బీజేపీ స్పందించి ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేస్తున్నాం.

– తెలంగాణ మంత్రులు

సీఈసీ రాజీనామా చేయాలి



- 'ఓటు బచావో.. దేశ్ బచావో'తో భారీ ఉద్యమానికి ప్రతిపక్షం శ్రీకారం
- ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం
- రాజ్‌ఘాట్‌లో ఇండియా కూటమి నేతల నిరసన

2

ఈసీని సైమన్ కమిషన్‌లా వాడే యత్నం



- ఓట్ల తొలగింపు అధికారం కేంద్రం దక్కించుకునే కుట్ర
- సర్‌తో పేదల ఓటు హక్కును హరించేందుకు ప్రయత్నం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

మొబైల్‌తో సుపరిపాలనకు కొత్త బాట


డిజిటల్ అంతరాన్ని తగ్గించడమే లక్ష్యం

- డీబీటీ ద్వారా రూ.50 లక్షల కోట్ల బదిలీ.. రూ.5 లక్షల కోట్లు ఆదా
- ప్రయాణం.. నిరీక్షణ.. ఖర్చు తగ్గాయి
- దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ.. 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు
- డిజిటల్ మోసాలపై ప్రపంచ చట్రం అవసరం
- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని మోడీ

డిజిటల్ అంతరం రూపంలో దేశం పెద్ద సవాలును ఎదుర్కొంటోంది. గత 10–12 ఏళ్లుగా మొబైల్ ఫోన్ ఆధునిక సమాచార సాధనంగానే కాకుండా, సుపరిపాలనకు ఒక ముఖ్య సాధనంగా కూడా ఆవిర్భవించింది. మొబైల్ ఫోన్ డిజిటల్ ఇండియా దార్శనికతకు కేంద్ర బిందువుగా నిలిచింది. సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం టెలికాం రంగంలో సంస్కరణలు చేపట్టింది. ఆ రంగంలో మౌలిక సదుపాయాలను విస్తరించింది. మొబైల్ ఫోన్లు, ఇతర టెలికాం హార్డ్‌వేర్‌లు దేశంలోనే తయారయ్యేలా చూడటంపై దృష్టి సారించింది. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరుకుంది. ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు ఈ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం పది రెట్లు పెరిగింది. దేశం 5జీ–రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది.


– ప్రధాని నరేంద్ర మోదీ

2



తెలంగాణకు మరో ఎండాకాలమేనా?

- నైరుతి రుతుపవనాల నిష్క్రమణ
- నవంబర్, డిసెంబరులోనూ సాధారణం కంటే 3,4 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు
- మరో 2 నెలలు ఎల్‌నినో ప్రభావం
- రానున్న 4–5 రోజులు వర్షాలు లేనట్టే



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రం నుంచి పూర్తిగా నిష్క్రమిస్తున్న నేపథ్యంలో రానున్న రోజుల్లోనూ ఉష్ణోగ్రతలు అధికంగానే కొనసాగే అవకాశ ముందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం మరో రెండు నెలల పాటు బలంగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. నైరుతి

తరువాయి 2లో



జీఎస్టీలో కీలక సంస్కరణలు

- పన్ను అధికారుల అరెస్ట్ అధికారాలు రద్దు
- ప్రాసిక్యూషన్ పరిమితి రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంపు
- రూ.10 వేలలోపు మొత్తాలకు నోటీసులు ఉండవు
- చిన్న ఈ–కామర్స్ విక్రేతలకు సరళతర నిబంధనలు
- జీఎస్టీ రేట్లలో మాత్రం ఎలాంటి మార్పు లేదు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

7


జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

తెలంగాణకు రూ.800 కోట్ల ఆదాయ నష్టం

- జీఎస్టీఎన్, కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలి
- పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నిజాయతీగా పన్నులు చెల్లించే వారిని ఇబ్బంది పెట్టొద్దు
- అధికారుల కమిటీల్లో తెలంగాణకు చోటు కల్పించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2





కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు
సాహిత్యంలో నోబెల్

- పురాతన సాహిత్యానికి ఆధునిక రూపం
- సంప్రదాయాలను కొత్త రూపాల్లో ఆవిష్కరించినందుకు గౌరవం
- కవిత్వం, అనువాదం, సాహిత్య పరిశోధనలో విశిష్ట సేవలకు గుర్తింపు

2

ఉద్రిక్తంగా 'చలో లోక్‌భవన్'

హైదరాబాద్: 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్‌బాబు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు వామపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



బారికేడ్ల వద్ద ఉద్రిక్తత

ర్యాలీ లోక్‌భవన్ వద్దకు చేరుకోగానే పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి నేతలను అడ్డుకున్నారు. దీంతో కూటమి నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళనకారులు ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించ డంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఈ క్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు లోక్‌భవన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డీసీఎంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'ఓటు హక్కును కాపాడుకోవాలి'

మంత్రులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓటు హక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రాహుల్ గాంధీ చేపడుతున్న నిరసనలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.మంత్రులు, ఇతర నేతల అరెస్టుతో లోక్‌భవన్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. రాజ్యాంగబద్ధ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, తమను ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేసేందుకు పోలీసులను ఉపయోగిస్తోందని అరెస్టైన నాయకులు ఆరోపించారు.

బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణే టార్గెట్: టీపీసీసీ

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు. మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కేటీఆర్‌కు దానం సవాల్

హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో తెలంగాణ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహిరంగ సవాల్ విసిరారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తనపై పోటీ చేసి గెలవాలని, ఈ పోరులో తాడోపేడో తేల్చుకుందామని అన్నారు. హైదరాబాద్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప ఎన్నికకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ''దానం నాగేందర్ అంటేనే ఒక బ్రాండ్'' అని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు రెఫరెండంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపైనా దానం స్పందించారు.

ప్రజల ఓటు హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని అన్నారు. ''ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆ అధికారం ఎవరిచ్చారు?'' అని ప్రశ్నించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న ఆందోళనలకు రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి నేతలు, యువత మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు పడటంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో విజయం సాధించి తీరుతామని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు.

రైతులకు బేడీలా?

హైదరాబాద్: పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు."ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తెలంగాణకు మరో ఎండాకాలమేనా?

(మొదటిపేజీ తరువాయి)

రుతుపవనాలు గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ నుంచి నిష్క్రమించాయని.. శుక్రవారం నాటికి రాష్ట్రం నుంచి పూర్తిగా తిరోగమించే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై ఆయన వివరాలు వెల్లడించారు.ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 35 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇవి సాధారణం కంటే సుమారు 4 డిగ్రీలు అధికమున్నారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

చలికాలంలోనూ ఎండలే!

సాధారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లో ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరుగుతుందని.. అయితే ఈసారి ఎల్‌నినో ప్రభావంతో పరిస్థితి భిన్నంగా ఉండొచ్చని తెలిపారు. శీతాకాలంలోనూ సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని చెప్పారు. దీంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉండొచ్చని అంచనా వేశారు. అంతర్జాతీయ వాతావరణ సంస్థల అంచనాల ప్రకారం ఎల్‌నినో మరో రెండు నెలల పాటు బలంగా కొనసాగే అవకాశముందని తెలిపారు. గత ఆరు నెలల్లో ఎల్‌నినో ప్రభావం క్రమంగా పెరిగినట్లే.. తగ్గడానికి కూడా కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. రుతుపవనాల సమయంలో గాల్లో తేమ అధికంగా ఉండటం సాధారణమేనని.. ఈసారి దానికి అధిక ఉష్ణోగ్రతలు తోడవడంతో ఉక్కపోత తీవ్రంగా అనిపిస్తోందని శ్రీనివాస్‌రావు వివరించారు.తెలంగాణలో రానున్న నాలుగు నుంచి ఐదు రోజుల వరకు పెద్దగా వర్ష సూచనలు లేవని తెలిపారు. తేమ అధికంగా ఉన్న ప్రాంతాల్లో సాయంత్రం వేళ మేఘావృత పరిస్థితులు ఏర్పడి తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు.నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించిన అనంతరం ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయని చెప్పారు. అయితే వాటి ప్రభావం ప్రధానంగా తూర్పు కోస్తా ప్రాంతాలపైనే ఉంటుందని.. తెలంగాణలో పెద్దగా వర్షాలు కురిసే అవకాశం ఉండదన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశాన్ని ముందుగానే అంచనా వేసి ఏడు రోజుల ముందు సమాచారం అందిస్తామని తెలిపారు.

సీఈసీ రాజీనామా చేయాలి

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్, ఇండియా కూటమి ఆందోళనలను ఉధృతం చేశాయి. 'ఓట్ బచావో – దేశ్ బచావో' పేరుతో దేశవ్యాప్త ఉద్యమానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టింది. ఎస్ఐఆర్ రద్దు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్లపై వెనక్కి తగ్గేది లేదని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.రాజ్‌కోట్‌లో నిరసనఇండియా కూటమి ఎంపీలు, నేతలు గురువారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో శాంతియుత నిరసన చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి 'ఓట్ల చోరీ'కి పాల్పడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. శుక్రవారం విపక్ష ఎంపీలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఎన్నికల సంఘం తీరుపై వినతిపత్రం ఇవ్వనున్నారు.13.3 కోట్ల ఓట్లపై కాంగ్రెస్ ఆరోపణఆరు రాష్ట్రాల్లో సుమారు 10 లక్షల పోలింగ్ బూత్‌ల పరిధిలో 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. వీరిని గుర్తించి తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు 'ఓట్ రక్షక్'లతో ఇంటింటి ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపింది. నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో మెగా ర్యాలీ, నవంబర్ 25 – 26న 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది.బెంగళూరులోనూ నిరసనబెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో సివిల్ సొసైటీల ఆధ్వర్యంలో 'ప్రజా ట్రైబ్యునల్' నిర్వహించారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, నటుడు ప్రకాశ్ రాజ్, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే నిరసనలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌లో పారదర్శకత, జవాబుదారీతనం లేదని ధ్రువ్ రాఠీ విమర్శించగా, ఎస్ఐఆర్‌ను పూర్తిగా రద్దు చేయాలని ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు.ఈసీ నియామకాలపై సుప్రీంకోర్టులో పిటిషన్ఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి నియామకాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిగాయని పిటిషనర్ ఆరోపించారు. సెర్చ్ కమిటీ సిఫారసులు, నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని పేర్కొంటూ, సంబంధిత రికార్డులను కోర్టు ముందుంచాలని కోరారు.

ఈసీని సైమన్ కమిషన్‌లా వాడే యత్నం

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషన్‌ను సైమన్ కమిషన్ తరహాలో ఉపయోగించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించి.. రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈసీ తీరును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దిల్లీలో కొనసాగుతున్న నిరసనలో రేవంత్ రెడ్డి గురువారం పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.ఇది కాంగ్రెస్ పార్టీ సమస్య కాదని.. దేశ ప్రజల సమస్య అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ పరిస్థితికి కారణమైన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మతం, భాష, ప్రాంతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో గెలిచేందుకు ఇప్పటివరకు ప్రయత్నించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అనంతరం ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుని రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ఈ ప్రయోగాలేవీ ఇకపై చెల్లవని భావించి.. ప్రస్తుతం ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

13 కోట్ల ఓట్ల తొలగింపునకు కుట్ర

వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపయోగించి 13 కోట్ల ఓట్లను తొలగించాలనే కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉపయోగించుకుని పేద ప్రజల ఓటు హక్కును హరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దేశంలోని 13 కోట్ల మందిని ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చే ప్రమాదకర రాజకీయ ఎత్తుగడను మోదీ ప్రభుత్వం ప్రయోగిస్తోందని విమర్శించారు.
భగత్‌సింగ్ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడినట్లే.. నేడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని పేద ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రజలు నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని అన్నారు.

మొబైల్‌తో సుపరిపాలనకు కొత్త బాట

న్యూఢిల్లీ: సాంకేతికతను సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడమే 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ అంతరాన్ని తగ్గిస్తూ ఆధునిక సాంకేతికత కొద్దిమందికే పరిమితం కాకుండా సామాన్యుడికీ చేరేలా చర్యలు చేపట్టామని తెలిపారు. మొబైల్ ఫోన్‌ను ఈ పరివర్తనకు కేంద్ర బిందువుగా మార్చడం ద్వారా పౌరులకు సాంకేతికతతో పాటు ప్రభుత్వ సేవలు సైతం సులభంగా అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. దిల్లీలోని యశోభూమిలో జరిగిన పదో ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)లో ప్రధాని మాట్లాడారు.
గత పదేళ్లలో మొబైల్ ఫోన్ కేవలం సమాచార మార్పిడి సాధనంగా కాకుండా సుపరిపాలనకు కీలక సాధనంగా మారిందని మోదీ చెప్పారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా ఇప్పటివరకు రూ.50 లక్షల కోట్లను లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ చేసినట్లు తెలిపారు. మధ్యవర్తిత్వం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా చేసినట్లు వివరించారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని చెప్పారు. పీఎం కిసాన్ పథకం కింద ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. నగదు ఖాతాలో జమ అయిన వెంటనే రైతుల మొబైల్ ఫోన్లకు సందేశం అందుతోందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందలేని కోట్లాది మంది చిన్న రైతులకు కూడా ఈ విధానం ద్వారా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు.మొబైల్ ఫోన్ ఇప్పుడు చాటింగ్, సమాచార మార్పిడికే పరిమితం కాలేదని మోదీ అన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల అరచేతిలోకి తీసుకురావడం ద్వారా ప్రయాణం, నిరీక్షణ, ఖర్చు తగ్గి సౌకర్యం పెరిగిందని తెలిపారు. వందలాది ప్రభుత్వ సేవలు ప్రస్తుతం మొబైల్ ఫోన్లలోనే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. టెలికాం రంగంలో మౌలిక వసతుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ప్రధాని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ, డేటా అందుబాటును పెంచడం వంటి చర్యలు చేపట్టామని చెప్పారు. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరిందని, ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు 5జీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం పది రెట్లు పెరిగిందని తెలిపారు.మొబైల్ ఫోన్లు, ఇతర టెలికాం పరికరాల తయారీని దేశంలోనే పెంచేందుకు చర్యలు తీసుకున్నామని మోదీ చెప్పారు. టెలికాం రంగంలో చేపట్టిన సంస్కరణలు, మౌలిక వసతుల విస్తరణ ఫలితంగా భారత్ వేగంగా డిజిటల్ మార్పు దిశగా సాగుతోందన్నారు. సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ నేరాలను ఎదుర్కొనేందుకు ప్రపంచవ్యాప్త చట్రం అవసరమని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. డిజిటల్ మోసాలకు దేశ సరిహద్దులు అడ్డుకావడం లేదని, అందువల్ల ప్రభుత్వాలు, టెక్నాలజీ సంస్థలు, టెలికాం ఆపరేటర్లు, ఆర్థిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సాంకేతికతపై ప్రజల్లో విశ్వాసం ఏర్పడినప్పుడే దాని ప్రయోజనాలు విస్తృత స్థాయిలో అందుతాయని అన్నారు. డిజిటల్ మోసాలను అరికట్టేందుకు పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రపంచానికి ఐఎంసీ వేదిక కావాలి

భారత్ టెలికాం రంగంలో సాధించిన ప్రగతిలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. గత కొన్నేళ్లుగా దేశ సాంకేతిక సామర్థ్యాలు, ఆకాంక్షలను ప్రపంచానికి చాటే వేదికగా ఐఎంసీ ఎదిగిందని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలకు టెలికాం మౌలిక వసతులను విస్తరించడంలోనూ ఈ రంగం కీలక పాత్ర పోషించిందన్నారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ.. ప్రపంచ సాంకేతిక రంగంలో భారత్ తన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన మానవ వనరులు, చలనశీలత, దృక్పథం దేశానికి ఉన్నాయని అన్నారు. భారత సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి ప్రదర్శించే వేదికగా ఐఎంసీ మరింతగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకు డేటా అందిస్తున్న దేశాల్లో భారత్ ఒకటని తెలిపారు. దశాబ్దం క్రితం దేశంలో 6 కోట్లుగా ఉన్న బ్రాడ్‌బ్యాండ్ చందాదారుల సంఖ్య ప్రస్తుతం 110 కోట్లకు పైగా చేరిందని వెల్లడించారు.

జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

న్యూఢిల్లీ: జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నిజాయతీగా పన్నులు చెల్లించే వారిని ఇబ్బందులకు గురిచేయకుండా, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం దిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. ఉమ్మడి జాతీయ మార్కెట్ ఏర్పాటుతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందనే ఆశతో రాష్ట్రాలు తమ స్వతంత్ర పన్ను విధింపు అధికారాలను గణనీయంగా తగ్గించుకుని జీఎస్టీ విధానానికి మద్దతు తెలిపాయని భట్టి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో సంస్కరణలు చేపట్టేటప్పుడు రాష్ట్రాల ఆదాయంపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.
జీఎస్టీ నెట్‌వర్క్ (జీఎస్టీఎన్), జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్ ప్రాంతీయ కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జీఎస్టీ కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాలు హైదరాబాద్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే జీఎస్టీ పరిపాలనతోపాటు పన్ను మోసాలను గుర్తించే వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని వివరించారు. మోటారు వాహనాలు, మూలధన వస్తువులు (క్యాపిటల్ గూడ్స్), ఇన్‌పుట్ సేవలకు సంబంధించిన రిఫండ్‌ల విషయంలో మార్పులు చేపట్టే ముందు వాటి పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు తెలియజేయాలని సూచించారు. కేంద్రం అంచనాలకు



ప్రకారమే మోటారు వాహనాల పన్ను మార్పులతో తెలంగాణకు ఏటా సుమారు రూ.800 కోట్ల ఆదాయ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.పన్ను చెల్లింపుదారులకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూనే జీఎస్టీ మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, వ్యక్తిగత గుర్తింపు వివరాల దుర్వినియోగాన్ని అరికట్టాలని భట్టి కోరారు. వృద్ధులు, గృహిణులు, రోజువారీ కూలీలు తదితరుల ఆధార్, పాన్ వివరాలను దుర్వినియోగం చేసి మోసపూరిత జీఎస్టీ రిజిస్ట్రేషన్లు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా స్క్రాప్ రంగంలో పన్ను ఎగవేత అధికంగా ఉందని, దానిని నియంత్రించేందుకు సమర్థమైన చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలో పన్నుల పరిపాలనలో చురుగ్గా పనిచేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అయినప్పటికీ అధికారుల కమిటీల్లో రాష్ట్రానికి చాలాకాలంగా తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ పునర్‌వ్యవస్థీకరించే కమిటీల్లో తెలంగాణకు సభ్యత్వం కల్పించాలని, స్టాండింగ్ కమిటీ ఆఫ్ ఆఫీసర్స్‌లోనూ రాష్ట్రానికి ప్రాతినిధ్యం ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు.

నటసామ్రాట్ నానా.. ఇకలేరు

పనాజీ: విలక్షణ నటనతో, వైవిధ్యభరితమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన దిగ్గజ నటుడు నానా పటేకర్ (75) కన్నుమూశారు. గోవాలోని తన నివాసంలో గురువారం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనకు గుండెపోటు రావడంతో ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న స్నేహితుడు అక్కడికి చేరుకునే సమయానికి ఆయన అపస్మారక స్థితిలో ఉన్నారు. ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు 45 నిమిషాలపాటు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని డాక్టర్ శేఖర్ సాల్కర్ తెలిపారు. నానా మృతిపై పోలీసులు మెడికో లీగల్ కేసు నమోదు చేసినట్లు సమాచారం.

పేదరికం నుంచి అగ్ర నటుడిగా..

1951లో మహారాష్ట్రలోని మురుద్–జంజీరాలో జన్మించిన నానా పటేకర్ అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. బాల్యంలో పేదరికాన్ని అనుభవించిన ఆయన రంగస్థల నటుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు.
1978లో 'గమన్' చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. 'పరిందా', 'ప్రహార్', 'తిరంగా', 'క్రాంతివీర్', 'అగ్నిసాక్షి', 'వెల్‌కమ్', 'రాజ్‌నీతి', 'నటసామ్రాట్' వంటి చిత్రాల్లో తనదైన నటనతో గుర్తింపు పొందారు. దాదాపు



ఇన్‌స్టాగ్రామ్ పరిచయం.. బ్యాంక్ మేనేజర్‌కు హనీ ట్రాప్

- గదిలో వీడియో తీసి బెదిరింపులు
- రూ.3 లక్షలు వసూలు
- మరో రూ.5 లక్షల కోసం డిమాండ్, ఐదుగురి అరెస్టు

గువాహటి: ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన మహిళను కలిసేందుకు వెళ్లిన ఓ ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్ హనీ ట్రాప్‌లో చిక్కుకున్న ఘటన అస్సాంలోని జోర్హాట్ జిల్లాలో వెలుగుచూసింది. మహిళతో కలిసి ఓ గదిలో ఉన్న సమయంలో కొందరు వ్యక్తులు లోపలికి వచ్చి వీడియో రికార్డు చేసి, దానిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని, కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరిస్తూ లక్షల రూపాయలు వసూలు చేశారు. టిస్సుకియాకు చెందిన ఓ ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్‌కు జూలైలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా జోర్హాట్‌కు చెందిన ఓ మహిళ పరిచయమైంది. అనంతరం ఆమె ఆగస్టు 14న జోర్హాట్‌కు రావాలని అతడిని ఆహ్వానించడంతో అర్ధరాత్రి దాటిన తర్వాత అక్కడికి చేరుకున్నాడు. అతడిని సియోని అలీ ప్రాంతంలోని ఓ అద్దె ఇంటికి తీసుకెళ్లిన మహిళ.. ఇద్దరూ గదిలో ఉండగా కొందరు వ్యక్తులు తలుపు తట్టారు. మహిళ తలుపు తీయగానే వారు లోపలికి ప్రవేశించి బ్యాంక్ మేనేజర్‌ను వీడియో తీశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేయడంతోపాటు అతడి కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరించారు. తొలుత రూ.2 లక్షలు డిమాండ్ చేయడంతో భయపడిన బ్యాంక్ మేనేజర్ ఆ మొత్తాన్ని చెల్లించాడు. అనంతరం మరో రూ.లక్షను కూడా అతడి నుంచి బలవంతంగా వసూలు చేశారు. అంతటితో ఆగకుండా మరో రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పదేపదే బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో తీవ్రంగా ఆందోళనకు గురైన బ్యాంక్ మేనేజర్ చివరకు అక్టోబర్ 2న జోర్హాట్ పోలీసులను ఆశ్రయించి హనీ ట్రాప్, బలవంతపు వసూళ్లపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు జోర్హాట్‌లోని గర్ముర్ ప్రాంతానికి చెందిన సంజీబ్ దాస్, అంకిత్ పాల్‌ను అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఈ ముఠా కార్యకలాపాలకు ప్రధాన సూత్రధారిగా మొరోమి దాస్ నియోగ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమె కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని దిబ్రుగఢ్‌కు పంపించి, నిర్దిష్ట సమాచారం ఆధారంగా ఆమెను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో మహిళ బేబీ బోరా, ఆమె భర్త అంకిత్ బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా వ్యాపారవేత్తలతోపాటు ఆర్థికంగా స్థిరపడిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి హనీ ట్రాప్, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ముఠా గత కార్యకలాపాలు, మరెంతమంది బాధితులు ఉన్నారనే అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసు అధికారి తెలిపారు.

కొచ్చిన్ షిప్‌యార్డ్‌కు 40కి పైగా నౌకల ఆర్డర్లు

- అమెరికా, జర్మనీ, నార్వే సహా పలు దేశాల నుంచి భారీ ఆర్డర్లు
- భారత నౌకానిర్మాణంపై ప్రపంచ విశ్వాసానికి ఇదే నిదర్శనం
- కేంద్ర ఓడరేవులు, నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్)కు అమెరికా, జర్మనీ, నార్వే సహా పలు దేశాల నుంచి 40కి పైగా నౌకల నిర్మాణానికి ఆర్డర్లు వచ్చినట్లు కేంద్ర ఓడరేవులు, నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. దేశంలో నౌకానిర్మాణానికి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని చెప్పారు. జర్మనీ, అమెరికా, నార్వే వంటి దేశాల నుంచి సీఎస్ఎల్‌కు అధికంగా నౌకానిర్మాణ ఆర్డర్లు వస్తున్నాయని సోనోవాల్ వెల్లడించారు. భారత్‌లోని నౌకాయాన సంస్థలతో కలిసి నౌకల నిర్మాణానికి కొన్ని రష్యా సంస్థలు కూడా ఆసక్తి చూపుతున్నాయని నౌకాయాన శాఖ ఉన్నతాధికారి తెలిపారు. భారత నౌకానిర్మాణ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయతను సంపాదించుకుంటున్నాయని సోనోవాల్ అన్నారు. నాణ్యమైన ఉత్పత్తి, నిర్మాణ సామర్థ్యంపై భారత్ అంతర్జాతీయ స్థాయిలో విశ్వాసం కల్పించగలుగుతోందని, అందుకే పెద్ద సంఖ్యలో ఆర్డర్లు వస్తున్నాయని చెప్పారు.

సిట్వే పోర్టు విజయవంతం

మూడో 'సాగర్‌మంథన్–ది ఓషన్ డైలాగ్' రెండో రోజు మయన్మార్ మంత్రితో సమావేశమైనట్లు సోనోవాల్ తెలిపారు. మయన్మార్‌లో తీరప్రాంత నౌకాయానం విజయవంతంగా కొనసాగుతోందని ఆయన చెప్పారని, సిట్వే పోర్టు కూడా సమర్థంగా పనిచేస్తోందని వివరించారు. నౌకానిర్మాణ రంగంలో భారత్‌తో కలిసి పనిచేయడానికి బెల్జియం ఆసక్తి వ్యక్తం చేసిందని మంత్రి తెలిపారు.

భర్త అవమానించాడని.. ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్య



చెన్నై: భర్త అందరి ముందు చెంపపై కొట్టడంతో తీవ్ర అవమానానికి గురైన ఓ మహిళ ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన తమిళనాడులోని తెన్‌కాసి జిల్లాలో చోటుచేసుకుంది. 28 ఏళ్ల మారియమ్మాళ్ తన ఇద్దరు కుమారులు ఆరేళ్ల కబినేశ్వరన్, నాలుగేళ్ల రబినేశ్వరన్‌తో కలిసి ఇంటికి సమీపంలోని ఆలయంలో నిర్వహిస్తున్న సంప్రదాయ నృత్య ఉత్సవానికి వెళ్లింది. అదే సమయంలో ఆమె భర్త కాళిపాండి మద్యం మత్తులో ఆలయం వద్దకు చేరుకుని అందరి సమక్షంలో భార్య చెంపపై కొట్టాడు. దీంతో తీవ్ర అవమానానికి గురైన మారియమ్మాళ్ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటికి తిరిగి వచ్చింది. అనంతరం ఇంటి తలుపులు వేసుకుని తన ఇద్దరు కుమారులపై కిరోసిన్ పోసి నిప్పంటించింది. ఆ తర్వాత తనపై కూడా కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఈ ఘటనలో మారియమ్మాళ్, ఆమె ఇద్దరు కుమారులు సజీవదహనమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ముగ్గురి కాలిన మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మారియమ్మాళ్ భర్త కాళిపాండిని విచారిస్తున్నారు.







ఆటిజంపై అపోహలు వీడాలి


- ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు దయ కాదు
- గౌరవం, అవకాశాలు కల్పించాలి
- ఆటిజం అవగాహన కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

ప్రజానావ, హైదరాబాద్: ఆటిజంపై సమాజంలో ఉన్న అపోహలు, తప్పుడు అభిప్రాయాలను తొలగించి ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు దయ కంటే గౌరవం, అవకాశాలు కల్పించాలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. ఆటిజం వ్యాధి కాదని, నాడీ వ్యవస్థ అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక పరిస్థితి అని పేర్కొన్నారు. రెడ్‌హిల్స్‌లో మాధవ్ ఆటిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటిజం అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ పదేళ్లుగా అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ పదేళ్ల ప్రయాణం సేవ, అంకితభావం, నిరంతర కృషికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రతి చిన్నారి ప్రపంచాన్ని తనదైన రీతిలో అర్థం చేసుకుంటారని, వారి సామర్థ్యాలను గుర్తించి ముందుకు సాగేందుకు తగిన అవకాశాలు కల్పించడం సమాజ బాధ్యత అని చెప్పారు. ఆటిజాన్ని సకాలంలో గుర్తించడం, సరైన జోక్యం, శిక్షణ, అవగాహన ఎంతో కీలకమని పేర్కొన్నారు. మాధవ్ ఆటిజం ఫౌండేషన్ ఆధునిక డే కేర్, డే బోర్డింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఈ కేంద్రం ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు సురక్షితమైన, ఆప్యాయతతో కూడిన వాతావరణాన్ని అందించే మరో ఇల్లుగా నిలవాలని ఆకాంక్షించారు. థెరపీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, సంగీతం, పౌష్టికాహారం వంటి సేవలను ఒకే చోట అందించడం మంచి ప్రయత్నమని ప్రశంసించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల తల్లిదండ్రులను వేధించే ప్రధాన ప్రశ్న 'మా తర్వాత మా పిల్లల పరిస్థితి ఏమిటి?' అనేదేనని గవర్నర్ అన్నారు. దీనికి కేవలం మౌలిక సదుపాయాలతో సమాధానం లభించదని, సున్నితమైన వ్యవస్థ, నిరంతర సహకారం, సమాజ సమష్టి బాధ్యత అవసరమని తెలిపారు. మాధవ్ ఆటిజం ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సుమన్ సరాఫ్ తన కుమారుడు మాధవ్ ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి, వాటినే స్ఫూర్తిగా మార్చుకుని అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచారని గవర్నర్ ప్రశంసించారు. ప్రత్యేక పిల్లల కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో పరిపాలన, వైద్య, పారిశ్రామిక, సామాజిక రంగాలకు చెందిన వారు చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సహకారం కేవలం ఆర్థికంగానే ఉండాల్సిన అవసరం లేదని, సమయం, నైపుణ్యం, వనరులు, మార్గదర్శకత్వం అందించడం ద్వారా కూడా ఈ కార్యక్రమాలను బలోపేతం చేయవచ్చన్నారు. తెలంగాణలో సమ్మిళిత సమాజ నిర్మాణానికి మాధవ్ ఆటిజం ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమం మంచి ఉదాహరణగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతి ప్రత్యేక చిన్నారికి గౌరవం, అవకాశం, ఆత్మనిర్భరత కల్పించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ పదేళ్లుగా అందిస్తున్న సేవలను అభినందిస్తూ.. భవిష్యత్ కార్యక్రమాలు విజయ వంతం కావాలని గవర్నర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ అగ్రవాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుద్ధ్ గుప్తా, మాధవ్ ఆటిజం ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సుమన్ సరాఫ్, కార్యదర్శి దిలీప్ పంసారీ, న్యూరాలజిస్ట్ డాక్టర్ శశికుమార్ జైస్వాల్, ఏఐజీ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ సందీప్ లఖ్‌టాకియా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గూడలో చోరీల భయం

- పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే వరుస ఘటనల ఫిర్యాదులు
- రాత్రివేళ నిఘా పెంచాలని స్థానికుల విజ్ఞప్తి

ప్రజానావ, హైదరాబాద్: పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న లక్ష్మీ గూడ హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీల భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లు, కొత్తగా నిర్మించిన నివాసాలను లక్ష్యంగా చేసుకుని రాత్రివేళల్లో చోరీలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు స్థానికుల్లో భయాందోళనకు కారణమవుతున్నాయి. ఇళ్ల తలుపులు పగులగొట్టి కాపర్ వైరింగ్, నిర్మాణ సామగ్రి, ఇతర విలువైన వస్తువులను అపహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడంతో కాలనీలో రాత్రివేళ పోలీసుల నిఘా, పెట్రోలింగ్ ఏ స్థాయిలో ఉందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చోరీల భయంతో కొందరు స్థానికులే రాత్రి 12 గంటల నుంచి ఒంటిగంట వరకు రోడ్లపై తిరుగుతూ కాపలా కాయాల్సి వస్తోందని వాపోతున్నారు. మరోవైపు కాలనీలోని కొన్ని ఇళ్ల వద్ద నిర్వహిస్తున్న చిన్న దుకాణాల వద్ద రాత్రివేళల్లో యువకులు గుంపులుగా చేరుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, విక్రయంపై అనుమానాలు ఉన్నాయని, పోలీసులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరుతున్నారు. అయితే ఈ అంశాలకు చోరీలతో ప్రత్యక్ష సంబంధం ఉందని నిర్ధారించకముందే చెప్పలేమని, అనుమానాస్పద కదలికలపై మాత్రం నిఘా అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. కాలనీ ప్రధాన ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద రాత్రివేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు పోలీస్ బీట్, పెట్రోలింగ్‌ను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై తనిఖీలు నిర్వహించి, చోరీలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి బాధ్యులను గుర్తించాలని కోరుతున్నారు. అలాగే మత్తు పదార్థాలపై అనుమానాలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు స్పందించి లక్ష్మీ గూడ హౌసింగ్ బోర్డు కాలనీలో భద్రతా చర్యలను ముమ్మరం చేసి, ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఉద్యోగాలు, ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ మాట తప్పింది

- హామీల అమలుపై స్పష్టత ఏదీ?
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బూత్ స్థాయి నుంచే సిద్ధం కావాలి
- జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ప్రజానావ, ఎర్రుపాలెం: ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను, సమస్యలు పరిష్కరిస్తామని ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటి అమలుపై మాట దాటవేస్తోందని విమర్శించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత, ఉద్యోగులు, పట్టభద్రులు కాంగ్రెస్ పాలనపై తమ అభిప్రాయాన్ని వెల్లడించనున్నారని అన్నారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కమల్‌రాజ్ పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్‌తో పాటు పలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న యువతకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పీఆర్సీ, డీఏలతో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట అన్న ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు అన్ని అంశాలను పరిశీలించి ప్రభుత్వ పనితీరును ప్రశ్నించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు అత్యంత కీలకమని కమల్‌రాజ్ అన్నారు. గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని బూత్ ఏజెంట్లను ఆదేశించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పట్టభద్రులను కలవడంతో పాటు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. బూత్ స్థాయి నుంచే ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి, తోట శ్రీనివాసరావు, సర్పంచ్ వేల్పుల బెంజిమెన్, నాయకులు గూడూరు రమణారెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కుడుముల మల్లికార్జునరెడ్డి, బొర్ర నరసింహారావు, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, గద్దల శ్రీనివాసరావు, కోట లోకేష్, షేక్ హుస్సేన్, రామకృష్ణ, కోట శ్రీనివాసరావు, సంక్రాంతి కృష్ణారావు, నరేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మొబైల్ ఫోన్ వివాదంతో వ్యక్తి దారుణ హత్య


- డంపింగ్ యార్డుకు తీసుకెళ్లి కర్రలతో దాడి
- మృతుడి గుర్తింపుపై పోలీసుల దర్యాప్తు

ప్రజానావ, రంగారెడ్డి: మొబైల్ ఫోన్ చోరీ విషయంలో తలెత్తిన వివాదం ఓ వ్యక్తి దారుణ హత్యకు దారితీసింది. చేవెళ్ల మండలం కందవాడ గ్రామ పరిధిలోని డంపింగ్ యార్డులో గురువారం సుమారు 40–45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి హత్యకు గురైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మొబైల్ ఫోన్ చోరీకి సంబంధించిన వివాదంతో బాధితుడిని మధ్యపెట్టి డంపింగ్ యార్డుకు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని ఒత్తిడి చేయగా అతడు నిరాకరించడంతో చేతులతో, చెక్క కర్రలతో దాడి చేసినట్లు నిందితుడి స్వచ్ఛంద వాంగ్మూలంలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో తలకు తీవ్ర గాయాలు కావడంతో బాధితుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. అనంతరం హత్యకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేసేందుకు మృతుడి మొబైల్ ఫోన్‌ను కాలుతున్న ప్రదేశంలో పడేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు.

ప్రకటనలకూ ఇక పన్ను మోత!

- టూ-లెట్ బోర్డు నుంచి మిస్సింగ్ పోస్టర్ వరకు రుసుమే
- అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు పెడితే భారీ జరిమానాలు
- జీహెచ్ఎంసీ పరిధిలో కొత్త నిబంధనలు

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో సంక్షేమం మాట దేవుడెరుగు.. పన్నులు, రుసుముల రూపంలో ప్రజలపై భారాన్ని మోపే చర్యలకు ప్రభుత్వం దిగుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పెరిగిన రిజిస్ట్రేషన్ విలువలు, ఆస్తిపన్ను భారంతో సతమతమవుతున్న గ్రేటర్ హైదరాబాద్ ప్రజలపై తాజాగా 'అడ్వర్టైజ్‌మెంట్ నిబంధనల' పేరుతో మరో భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇకపై సొంతింటికి 'టు–లెట్' బోర్డు పెట్టాలన్నా, ట్యూషన్ వివరాలతో చిన్న బోర్డు ఏర్పాటు చేయాలన్నా, తప్పిపోయిన వ్యక్తుల కోసం పోస్టర్ అంటించాలన్నా, స్థానిక క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్ ఆహ్వానాలు, సామాజిక కార్యక్రమాల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నా సంబంధిత పురపాలక సంస్థకు రుసుము చెల్లించాల్సిందే. క్యూర్ (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) పరిధిలో తాత్కాలిక, స్థానిక (హైపర్ లోకల్) ప్రకటనల బోర్డులకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రకటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్ జీవో నం.926ను విడుదల చేశారు. 'మై క్యూర్' లేదా 'అడ్వర్టైజ్‌మెంట్' యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే బుకింగ్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ నిబంధనల ప్రకారం క్యూర్ పరిధిలో చిన్న ప్రకటనకైనా సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్‌కు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. సొంత ఇల్లు లేదా దుకాణంలో ఖాళీగా ఉన్న స్థలం అద్దెకు ఇవ్వడానికి చిన్న బోర్డు ఏర్పాటు చేసినా అనుమతితోపాటు ఫీజు చెల్లించాలి. స్థానికంగా నిర్వహించే క్రికెట్, కబడ్డీ వంటి క్రీడా పోటీల ఆహ్వానాలు, సామాజిక



సేవా కార్యక్రమాల ఫ్లెక్సీలకు కూడా రుసుము విధించారు. తప్పిపోయిన వ్యక్తుల వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు ఏర్పాటు చేసే పోస్టర్లను సైతం ప్రకటనల కేటగిరీలోకి తీసుకురావడంతో వాటికీ ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నాలుగు కేటగిరీలుగా ఫీజులు

ప్రాంతాలను ఎస్, ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి ప్రభుత్వం రుసుములను నిర్ణయించింది. రోజుకు రూ.100 నుంచి రూ.500 వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా ప్రకటనలు ఏర్పాటు చేస్తే రోజుకు రూ.1,000 నుంచి రూ.2,000 వరకు జరిమానా విధిస్తారు. ఇంటి యజమాని ఆస్తిపన్ను చెల్లిస్తున్నప్పటికీ సొంత ఇంటి ముందు టు–లెట్, ట్యూషన్ బోర్డులు పెట్టేందుకు ప్రత్యేక రుసుము చెల్లించాలనే నిబంధనపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ రోజులపాటు టు–లెట్ బోర్డులు ఉంచాల్సి వస్తే అదనపు భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఫీజులు, జరిమానాలను తాత్కాలిక, హైపర్ లోకల్ ప్రకటనలుగా రెండు కేటగిరీలుగా విభజించారు. తాత్కాలిక ప్రకటనలకు మూడు రోజుల వరకు, హైపర్ లోకల్ ప్రకటనలకు ఒకటి నుంచి ఏడు రోజుల వరకు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఇంటి ముందు టు–లెట్, ట్యూషన్ బోర్డులు, మిస్సింగ్ వ్యక్తుల పోస్టర్లు, టోర్నమెంట్ ఆహ్వానాలు, సామాజిక కార్యక్రమాల ప్రకటనలు తదితరాలకు గరిష్ఠంగా 6×6 అడుగుల పరిమాణంలో బోర్డులు ఏర్పాటు చేసేందుకు క్యూర్ యాప్‌లో అనుమతి తీసుకోవాలి.

గ్రేటర్ ప్రజల్లో వ్యతిరేకత

ఉపాధి అవకాశాలు పెంచడం, ధరలు తగ్గించడంపై దృష్టి పెట్టకుండా ఇంట్లో ఖాళీగా ఉన్న పోర్షన్‌ను అద్దెకు ఇవ్వడానికి ఏర్పాటు చేసే చిన్న బోర్డుపైనా పన్నులు, రుసుములు విధించడం ఏమిటని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త నిబంధనలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనధికారిక ప్రకటనలను క్రమబద్ధీకరించి ఆదాయం పెంచుకోవాలే తప్ప సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఫీజుల భారం మోపడం సరికాదని విమర్శిస్తున్నారు.

ప్రతి వార్డుకు నోడల్ అధికారి

హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీల నియంత్రణకు 'మై క్యూర్' లేదా 'అడ్వర్టైజ్‌మెంట్' యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే బుకింగ్ చేసుకోవాలి. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డులో వార్డు స్థాయి అడ్వర్టైజ్‌మెంట్ నోడల్ అధికారిని నియమించనున్నారు. నోడల్ అధికారి గుర్తించిన ప్రదేశాల్లోనే ప్రకటనలకు అనుమతి లభిస్తుంది. ప్రకటనల కోసం కనీసం ఏడు రోజుల ముందే స్లాట్ బుక్ చేసుకోవాలి. ఒకే ప్రదేశంలో భారీ పరిమాణంలో బోర్డు ఏర్పాటు చేయకుండా నిర్ణయించిన పరిమితికి అనుగుణంగా వేర్వేరు స్లాట్లను కేటాయిస్తారు. అనుమతి పొందిన ప్రతి ప్రకటన కింద భాగంలో క్యూఆర్ కోడ్, ప్రింటర్ వివరాలను తప్పనిసరిగా ముద్రించాలి. నోడల్ అధికారి లేదా మున్సిపల్ అధికారులు ప్రకటనలను తనిఖీ చేసి అనుమతులను పరిశీలిస్తారు. అనుమతి లేని ప్రకటనలను అధికారులు, పోలీసులు, హైడ్రా బలగాలు తక్షణమే తొలగిస్తాయి. తొలగింపు ఖర్చులతోపాటు భారీగా జరిమానాలు కూడా విధిస్తారు. తాత్కాలిక ప్రకటనల గరిష్ఠ పరిమాణం 18×18 అడుగులుగా నిర్ణయించారు. వీటిని గరిష్ఠంగా మూడు రోజులపాటు మాత్రమే ఏర్పాటు చేసుకోవచ్చు. రోజువారీ రుసుము రూ.1,000 నుంచి రూ.4,000 వరకు ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే రోజుకు రూ.2,000 నుంచి రూ.8,000 వరకు చలానా విధిస్తారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వారస త్వ కట్టడాలు, ఫ్లైఓవర్లు, విగ్రహాలపై ఎలాంటి ప్రకటనలు ఏర్పాటు చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రకటనల వల్ల ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొంది.



స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా రాణించాలి

- ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే ప్రత్యామ్నాయ రంగాలపై దృష్టి పెట్టాలి
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

ప్రజానావ, తుంగతుర్తి: నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా రాణించాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ సూచించారు. తుంగతుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు తడకమళ్ల రవికుమార్ ఏర్పాటు చేసిన రాయల్ చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడుతూనే ప్రత్యామ్నాయంగా వివిధ వ్యాపార, స్వయం ఉపాధి రంగాల్లో అవకాశాలను అన్వేషించాలని సూచించారు. సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి యువత చేరుకోవాలని ఆకాంక్షించారు. యువతలో వ్యాపార దృక్పథాన్ని పెంపొందించేందుకు స్వయం ఉపాధి మంచి మార్గమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, కేతిరెడ్డి గోపాల్‌రెడ్డి, తునికి సాయిల్ గౌడ్, గుండగాని దుర్గయ్య, కొండగడుపుల నాగయ్య, కరుణాకర్, గొపగాని రమేశ్, గునిగంటి సంతోష్, ఉప్పుల నాగమల్లు, బొజ్జ సాయికిరణ్, మల్లికార్జున్, మల్లేష్, మధు, సాయి, గోపి, రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలకే ప్రపంచ రికార్డు

- టేక్మాల్ చిన్నారి సువిక్ష నందన అరుదైన ఘనత
- 2 నెలల 13 రోజుల వయసులోనే తల నియంత్రణ, సమతుల్యతలో ప్రతిభ
- బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు



ప్రజానావ, టేక్మాల్: మెదక్ జిల్లా టేక్మాల్ మండలానికి చెందిన రెండు నెలల చిన్నారి లింగంపల్లి సువిక్ష నందన అత్యంత పిన్న వయసులోనే అరుదైన ప్రపంచ రికార్డు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. కేవలం 2 నెలల 13 రోజుల వయసులోనే నిటారుగా ఉన్న స్థితిలో తలను పైకి ఎత్తడంతోపాటు ఇరువైపులా సులభంగా తిప్పే ప్రత్యేక శారీరక సామర్థ్యాన్ని ప్రదర్శించినందుకు ప్రతిష్ఠాత్మక బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ చిన్నారి ప్రతిభను అధికారికంగా గుర్తించింది. సువిక్ష నందన ప్రదర్శించిన తల నియంత్రణ, మెడ బలం, శరీర సమతుల్యత, కదలికల సమన్వయం వంటి అంశాలను రికార్డు నిర్వాహకులు నిశితంగా పరిశీలించిన అనంతరం ఆమె సాధించిన ఘనతను ధ్రువీకరించారు. ఈ సందర్భంగా చిన్నారికి వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, రికార్డ్ హోల్డర్ గుర్తింపు పత్రం, మెడల్, ప్రత్యేక అవార్డును అందజేశారు. సువిక్ష నందన తల్లిదండ్రులు లింగంపల్లి రజిత, జనార్ధన్ తెలంగాణ వ్యవసాయ శాఖలో వ్యవసాయ విస్తరణ అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారు. తమ కుమార్తె పసిప్రాయంలోనే ప్రపంచ రికార్డు సాధించడంపై వారు ఆనందం వ్యక్తం చేశారు.

అరగుంట భూమి అక్రమమని రుజువు చేస్తే క్షమాపణ చెబుతా

- మంత్రుల ఆరోపణలకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సవాల్



ప్రజానావ, మహబూబ్‌నగర్: తాను అక్రమంగా ఆస్తులు సంపాదించానంటూ రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను అరగుంట భూమిని అక్రమంగా సంపాదించినట్లు రుజువు చేస్తే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతానని మంత్రులకు సవాల్ విసిరారు. పాలమూరు జిల్లాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు వందలాది ఎకరాల భూమి ఉందంటూ కాంగ్రెస్ నాయకులు మూడేళ్లుగా దుష్ప్రచారం చేస్తున్నారని, ఇప్పటివరకు ఆ ఆరోపణలను రుజువు చేయలేకపోయారని అన్నారు. తనపై వ్యతిరేక ప్రచారం చేస్తే చట్టబద్ధంగా ఎదుర్కొంటానని హెచ్చరించారు. పానగల్ వ్యవసాయ క్షేత్రం తన కష్టార్జితమని స్పష్టం చేశారు. 663 సర్వే నంబర్ ఉబేద్దుల కొత్వాల్‌కు చెందినదని, ఈ విషయంలో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తమ కుమార్తెకు చెందిన అరగుంట భూమి అక్రమమని తేల్చారని ఆరోపించారు. ప్రభుత్వంపై నిత్యం పోరాడుతూ ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న తనపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తన ఆస్తులన్నింటినీ బహిరంగంగా వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానని, తనపై చేసిన భూ ఆక్రమణ ఆరోపణలను మీడియా సాక్షిగా రుజువు చేయాలని డిమాండ్ చేశారు. అసూయ, కుయుక్తులతో రాజకీయ మనుగడ సాధించలేరని, దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించి బహిరంగ చర్చకు రావాలని మంత్రులకు సూచించారు. ఇదిలా ఉండగా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో 70 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, కేఎల్‌ఐ పంపులను నిర్విరామంగా నడిపి జూరాల నుంచి నీటిని విడుదల చేసి రైతాంగాన్ని కాపాడాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నార్లపూర్ పంపులను వెంటనే ప్రారంభించకపోతే 12న వేలాది మంది రైతులతో కలిసి నార్లపూర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు విద్యుత్, సాగునీరు, యూరియా కొరతతో పాటు రుణమాఫీ, రైతుభరోసా అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం నాయకుల కుసంస్కారానికి నిదర్శనమని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించి సాగునీరు, విద్యుత్, ఎరువుల లభ్యతను మెరుగుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, బి. లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, లక్ష్మారెడ్డి, నందిమల్ల అశోక్, కృష్ణానాయక్, మాణిక్యం, వనం రాములు, రాళ్ల కృష్ణయ్య, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

60 వేల మంది విద్యార్థులకు వేడి వేడి అల్పాహారం

- రూ.9.6 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ కిచెన్
- రాష్ట్రంలోనే తొలి మెగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ వంటశాల
- 1,029 విద్యాసంస్థలకు రోజూ పౌష్టికాహారం



ప్రజానావ, సూర్యాపేట: పాఠశాల తొలి గంట మోగే సమయానికే వేలాది మంది విద్యార్థులకు వేడి వేడి అల్పాహారం అందించేందుకు సూర్యాపేట జిల్లాలో భారీ స్థాయిలో ఆధునిక వంటశాల రూపుదిద్దుకోనుంది. ఒకటి రెండు వేల మంది కాదు.. ఏకంగా 60 వేల మంది విద్యార్థులకు శుచి, శుభ్రత, నాణ్యత ప్రమాణాలతో పౌష్టికాహారం అందించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మించనున్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా సహకారంతో మునగాల మండలం ఎస్ఎంపేట సమీపంలోని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.9.6 కోట్ల వ్యయంతో ఈ మెగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో ఖాళీ కడుపుతో బడికి వచ్చే వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఆరోగ్యకరమైన, పౌష్టికాహారం అందించడంతోపాటు వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయనుంది. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని 1,029 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాలతో కూడిన అల్పాహారం అందించనున్నారు. ప్రతి విద్యార్థికి వారంలో మూడు రోజులు 150 మిల్లీలీటర్ల పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా ప్రణాళిక రూపొందించారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా అందించనున్నారు. నాలుగు నియోజకవర్గాల్లోని విద్యాసంస్థలకు ఆహారం సకాలంలో చేరేలా నాణ్యమైన ప్యాకింగ్, వేగవంతమైన రవాణా, పంపిణీ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఇలాంటి మెగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ ఏర్పాటు కానుండటం విశేషం. సింగరేణి సంస్థ అందించే రూ.9.6 కోట్ల విరాళంతో నిర్మించనున్న ఈ వంటశాలలో పెద్ద మొత్తంలో అల్పాహారాన్ని పరిశుభ్రంగా, రుచికరంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసేందుకు ఆధునిక ఆటోమేటెడ్ సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. ఆహార నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించేందుకు అత్యాధునిక ఆహార నాణ్యత పరీక్షా ప్రయోగశాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. రోజువారీ మెనూ ప్రకారం గంటల వ్యవధిలోనే వేలాది మంది విద్యార్థులకు సరిపడా వేడి అల్పాహారం సిద్ధం చేసేలా యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గంటకు 5,400 ఇడ్లీలు, 2 వేల దోసెలు, 3,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం కలిగిన ఆటోమేటెడ్ స్టీమర్లు, ఇతర యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా రెండు గంటల్లో 5 వేల మంది విద్యార్థులకు సరిపడా సాంబారు, కూరలను తయారు చేయగల ఆటోమేటెడ్ సాంబార్ పాత్రలు, కూరల తయారీ పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. పావు గంటలోనే వెయ్యి మంది విద్యార్థులకు సరిపడా అన్నం వండేలా అధిక సామర్థ్యం కలిగిన పరికరాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. భారీ స్థాయిలో ఆహార తయారీ జరిగినప్పటికీ పరిశుభ్రత, నాణ్య త, రుచి, పోషక విలువలకు ప్రాధాన్యం ఇస్తూ ఆహారాన్ని సిద్ధం చేసి నిర్ణీత సమయానికి విద్యాసంస్థలకు చేరేలా ఈ కిచెన్ నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

పరిహారం కోసం కలెక్టరేట్‌లో బాధితుల ఆందోళన

- 9 ఏళ్లుగా అందని భూముల పరిహారం
- డిప్యూటీ కలెక్టర్ కాళ్లపై పడి వేడుకోలు
- ముడుపులు చెల్లించనందుకే నిలిపివేశారంటూ బాధితుల ఆరోపణ
- రెడ్ పిటిషన్ల కారణంగానే పెండింగ్‌లో ఉందన్న అధికారి

ప్రజానావ, నల్లగొండ: పెండ్లిపాకల ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన బాధితులు పరిహారం కోసం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ఆందోళనకు దిగారు. కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన తమకు 2013 జీవో ప్రకారం పరిహారం మంజూరైనా తొమ్మిదేళ్లుగా డబ్బులు అందలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. ఈ క్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యూనిట్–1 అధికారి లీలను కలిసి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు. కొందరు బాధితులు ఆమె కాళ్లపై పడి తమకు పరిహారం ఇప్పించాలని కన్నీటితో విజ్ఞప్తి చేశారు. ముడుపులు చెల్లించనందుకే తమ పరిహారం నిలిపివేశారని బాధితులు అధికారులపై ఆరోపణలు చేశారు. ఏళ్ల తరబడి పరిహారం కోసం ఎదురుచూస్తున్న తమపై అధికారులు కనికరం చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. అయితే పరిహారం చెల్లింపులు నిలిచిపోవడానికి రెడ్ పిటిషన్లు ఉండటమే కారణమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీల బాధితులకు వివరించారు. నిబంధనల ప్రకారం సమస్యను పరిశీలించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.





వ్యవసాయానికి విద్యుత్ కోతలపై రైతులతో ధర్నా

- సాగునీరు, విద్యుత్ సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయి
- గాదరి కిషోర్‌కుమార్
- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజానావ, తిరుమలగిరి: వ్యవసాయానికి విద్యుత్ కోతలు విధించడాన్ని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందకపోవడంతోపాటు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. గతంలో తుంగతుర్తి నియోజకవర్గానికి కాళేశ్వరం ద్వారా సాగునీరు అందేదని, ప్రస్తుతం ఆ నీళ్లు కనిపించడం లేదని అన్నారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నాయని, ఈ కీలక సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తే పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని సూచించారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పటికీ వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే ఉత్పత్తి చేయడం లేదని కిషోర్‌కుమార్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన ఆయన రూ.50 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, రేవంత్‌రెడ్డిని వదిలేది లేదని, అవినీతికి సంబంధించిన వివరాలన్నింటినీ బయటకు తీస్తామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగలడం ఖాయమని, రైతుల ఆగ్రహానికి గురైన ప్రభుత్వం నష్టపోక తప్పదని కిషోర్‌కుమార్ వ్యాఖ్యానించారు. రైతుల పంటలను కాపాడేందుకు వెంటనే విద్యుత్ కోతలను ఎత్తివేసి, సాగునీరు అందించడంతోపాటు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ దృష్టి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్

ప్రజానావ, ఖమ్మం: రాబోయే ఖమ్మం–నల్లగొండ–చరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం పార్టీ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహించిన పార్టీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో ప్రస్తుతం 28,500 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి 100 ఓట్లకు ఒక సమన్వయకర్త చొప్పున అదనంగా 325 మందికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే (ఎస్ఐఆర్) తరహాలోనే ఈసారి కూడా ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రుల వివరాలను సేకరించాలని సూచించారు. డివిజన్ల వారీగా ప్రత్యేకంగా టెంట్లు, గుడారాలు ఏర్పాటు చేయడం తోపాటు పార్టీ కార్యాలయాల వద్ద ఎన్‌రోల్‌మెంట్ క్యాంపులు నిర్వహించి ఓటరు నమోదు ప్రక్రియను ఉద్ధృతం చేస్తున్నట్లు చెప్పారు. తానూ స్వయంగా వచ్చే నెల రోజులపాటు కనీసం వారానికి రెండు రోజులు ఈ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటానని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఆర్జేసీ కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, ఖమర్, మాజీ కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, షేక్ మక్బుల్, శీలంశెట్టి వీరభద్రం, నాగండ్ల కోటేశ్వరరావు, జ్యోతి రెడ్డి, పల్లా రోజ్లీనా, కమల, బుడిగం శ్రీను, బుర్రి వెంకటేశ్వర్లు, బిక్కసాని ప్రశాంతి జస్వంత్, పసుమర్తి రామ్మోహన్, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, నాయకులు మెంతుల శ్రీశైలం, కొత్త వెంకటేశ్వరరావు పాషా, బత్తుల మురళి, వీరు నాయక్, పిన్ని కోటేశ్వరరావు, గుత్తా రవి, మద్దినేని వెంకటరమణ, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, మెంటం రామారావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం

ప్రజానావ, కామేపల్లి: కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామ పంచాయతీ పరిధిలో పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమా ముఖ్య అతిథిగా హాజరై పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో సులభంగా లభించే అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండడం తోపాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు. పోషణ మాసం సందర్భంగా నెల రోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. బ్లాక్ కోఆర్డినేటర్ రమేశ్ మాట్లాడుతూ 'మన అంగన్‌వాడీ–మన బాధ్యత' అనే భావనతో ప్రతి ఒక్కరూ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సెక్టార్ సూపర్‌వైజర్ బి.వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.




కరెంటు కోతలపై రైతులతో రాస్తారోకో

- 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇచ్చే వరకు సబ్‌స్టేషన్ల ముట్టడి: బీఆర్ఎస్ నేతలు

ప్రజానావ, నిజాంపేట: విద్యుత్ కోతలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు నిజాంపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడంతో లోఓల్టేజీ సమస్య ఏర్పడి పొలాల వద్ద మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్ట దశలో ఉన్న వరి పంట ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతులకు స్వచ్ఛమైన 24 గంటల విద్యుత్ సరఫరా అందించే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సుమారు గంట పాటు ప్రధాన రహదారిపై రాస్తారోకో కొనసాగడంతో దాదాపు కిలోమీటరు మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులు, బీఆర్ఎస్ నాయకులను సముదాయించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌లు అందే కొండల్‌రెడ్డి, కనకరాజు, మాజీ ఎంపీపీ సంపత్, బీఆర్ఎస్ యువజన మండల అధ్యక్షుడు మౌరం రాజు, మాజీ ఎంపీటీసీలు వెంకటస్వామి, బాల్‌రెడ్డి, నాయకులు రంజిత్‌గౌడ్, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ కొలువులకు భారీ పోటీ

- 65 తాత్కాలిక పోస్టులకు 4,088 దరఖాస్తులు
- ఉన్నత చదువులు పూర్తిచేసిన వారూ పోటీలో
- ఒక్క స్టాఫ్ నర్సు పోస్టుకు 94 మంది దరఖాస్తు
- ఉద్యోగాల పేరుతో దళారుల బేరసారాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



ప్రజానావ, సూర్యాపేట: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఒప్పంద, పొరుగు సేవల కింద ఖాళీగా ఉన్న తాత్కాలిక పోస్టుల భర్తీకి జిల్లా యంత్రాంగం జారీ చేసిన ప్రకటనకు భారీ స్పందన లభించింది. జీతాలు ఆశించిన స్థాయిలో లేకపోయినా ప్రభుత్వ ఉద్యోగంపై ఉన్న ఆసక్తితో ఉన్నత విద్యావంతులైన అభ్యర్థులు సైతం ఈ పోస్టుల కోసం పోటీ పడుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో రెండు విడతలుగా భర్తీకి ప్రకటనలు వెలువడగా మొత్తం 65 తాత్కాలిక పోస్టులకు 4,088 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) 19 పోస్టులకు భారీ పోటీ నెలకొంది. ఈ పోస్టులకు బీఏఎంఎస్ పూర్తిచేసిన 43 మందితో పాటు ఎంబీబీఎస్ పూర్తిచేసిన 45 మంది కూడా దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా ఈ పోస్టులకు 445 మంది పోటీలో ఉన్నారు. స్టాఫ్ నర్సుల 16 పోస్టులకు అత్యధికంగా 1,508 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్క పోస్టుకు సగటున 94 మంది పోటీ పడుతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ 8 పోస్టులకు 911 మంది, ఏఎన్ఎం 7 పోస్టులకు 708 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక ఫార్మాసిస్టు పోస్టుకు కూడా 296 మంది పోటీ పడటం విశేషం. మిగిలిన పోస్టులకు సైతం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా తాత్కాలిక ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు దళారులు రంగంలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అభ్యర్థులకు మాయమాటలు చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తమకు తెలిసిన నేత ఉన్నారని, ఆయనతో ఒక్క ఫోన్ చేయిస్తే లేదా సిఫార్సు లేఖ ఇప్పిస్తే ఉద్యోగం ఖాయమంటూ కొందరు నమ్మబలుకుతున్నట్లు సమాచారం. మరికొందరు జిల్లాలోని ఉన్నతస్థాయి అధికారికి దరఖాస్తు ఇవ్వాలని, అక్కడి నుంచి పైరవీ చేయించి ఉద్యోగం వచ్చేలా చూస్తామని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇంకొందరు ముందుగా కొంత డబ్బు ఇవ్వాలని, ఉద్యోగం ఇప్పించే బాధ్యత తమదేనని, ఒకవేళ ఉద్యోగం రాకపోతే డబ్బు తిరిగి ఇచ్చేస్తామని అభ్యర్థులను ప్రలోభపెడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఇలాంటి మోసపూరిత హామీలను నమ్మవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. తాత్కాలిక పోస్టుల భర్తీ ప్రక్రియను కలెక్టర్ అనుమతితో పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. రాహుల్ తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేదని స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌తో పాటు కార్యాలయంలోనూ అందుబాటులో ఉంచుతామని, అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా మాయమాటలు చెప్పినా, డబ్బులు డిమాండ్ చేసినా వారి మాటలు నమ్మవద్దని డీఎస్పీ శివరాంరెడ్డి సూచించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తుల సమాచారం స్థానిక పోలీస్ స్టేషన్లలో అందజేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



శ్రమించే చేతులకు గౌరవమే నిజమైన సేవ

పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి సత్కారం.. సహపంక్తి భోజనం

ప్రజానావ, జనగామ: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నర్సయ్య ఆధ్వర్యంలో జనగామ మండలంలో పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి గౌరవం చాటడంతో పాటు వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం ఎండ, వాన, చలి లెక్కచేయకుండా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కందుల సంధ్యారాణి కొనియాడారు. ''శ్రమించే చేతులకు గౌరవం ఇవ్వడమే నిజమైన సేవ'' అని పేర్కొన్నారు. కార్మికుల సేవలను గుర్తించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన తడగొండ నర్సయ్యను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య, లక్ష్మీ నగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, ఎస్సీ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్, మహిళా మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీ సులువ పద్మ, ఉపాధ్యక్షురాలు ఎల్తూరి సరిత, లేబర్ సెల్ జిల్లా కో–కన్వీనర్ ఎల్తూరి రాజయ్య, కోడూరి రమేష్, జనగామ సాగర్, మాదర బోయిన రాకేష్, కొట్టే నరేష్, జక్కుల బాలు, జక్కుల ప్రవీణ్, పద్మ, రామ గిరి నరేష్, సాతిరి గంగరాజు, బియ్యాల మహేందర్, శిలారపు కళ్యాణ్, జనగామ శివరాం, మీస వికాస్, ఇరుగురాళ్ల శివకుమార్, దెబ్బట కమలాకర్, నడిగోట్ల రాజేందర్, అంకరి భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజానావ, సిరిసిల్ల: విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. గురువారం సుభాష్‌నగర్‌లోని సీపీఐ కార్మిక భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రూ అప్ చార్జీల పేరుతో నవంబర్ నుంచి యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి 50 పైసల చొప్పున చార్జీలు పెంచే ప్రతిపాదనతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ముఖ్యంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఈ పెంపు తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోకుంటే ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటి వేణు, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా పదేళ్ల పండుగను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటై పదేళ్ల పూర్తయిన సందర్భంగా పదేళ్ల పండుగను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య పిలుపు నిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు ఉద్యమ సమయంలో నినాదాలుగా ఉన్న ప్రజల ఆకాంక్షలు.. నేడు అభివృద్ధి రూపంలో సాకారమయ్యాయని అన్నారు. నర్సింగ్, మెడికల్, అగ్రికల్చర్, జేఎన్టీయూ పాలిటెక్నిక్ కళాశాలలు, బతుకమ్మ ఘాట్లు, క్రీడా ప్రాంగణాలతో పాటు వ్యవసాయం, చేనేత, విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, సంక్షేమ రంగాల్లో జిల్లా గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. ఈ అభివృద్ధిని స్మరించుకుంటూ పదేళ్ల పండుగను ప్రజల పండుగగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, ఆకునూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్‌కు ఘన సన్మానం



ప్రజానావ, గుడిహత్నూర్: ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డా. ఆడే క్రాంతి కుమార్‌ను గుడిహత్నూర్ మండల బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డా. ఆడే క్రాంతి కుమార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఆపదలో ఉన్నవారికి, పేదలకు, బాధితులకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కోరారు. సమాజంలో అవసరమైన వారికి సకాలంలో సహాయం అందించడంలో రెడ్‌క్రాస్ సొసైటీ మరింత చురుకైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ములుగులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇనుక లారీ అదుపుతప్పి డీసీఎం వ్యాన్, కారును ఢీకొట్టిన వైనం
- ఒకరి మృతి.. పలువురికి గాయాలు

ప్రజానావ, ములుగు: ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. గోవిందరావుపేట మండలం పస్రా ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌కు అర కిలోమీటర్ దూరంలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ఇనుక లారీ అదుపుతప్పి సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న డీసీఎం వ్యాన్‌తో పాటు మరో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ప్రమాదం సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

- కోరా కొప్పుల సత్యనారాయణ గౌడ్ కుటుంబానికి మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ
- కాంగ్రెస్‌కు ఆయన సేవలు చిరస్మరణీయం: శ్రీధర్‌బాబు





ప్రజానావ, వేములవాడ: సుందిళ్ల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోరా కొప్పుల సత్యనారాయణ గౌడ్ మృతి పట్ల రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి సుందిళ్ల గ్రామానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. సత్యనారాయణ గౌడ్ మృతి విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్‌బాబు సుందిళ్లలోనిఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిత్రమటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం కోరా కొప్పుల సత్యనారాయణ గౌడ్ అందించిన సేవలను గుర్తుచేశారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అన్ని విధాలుగా అండగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కూడా సత్యనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేలా ముందుకు వెళ్లాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన సర్పంచులు, వైద్య సిబ్బందికి సర్టిఫికెట్లు అందించి.. అభినందించిన జిల్లా కలెక్టర్
- టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం
- 20 మంది క్షయ బాధితులకు పోషణ కిట్ల పంపిణీ



ప్రజానావ, సిరిసిల్ల : టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేలా వైద్య సిబ్బంది పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు, వైద్య సిబ్బందికి నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలు, వైద్య పరీక్షలు, మందులు, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద ఎంపికైన 20 గ్రామ పంచాయతీల సర్పంచులు, వైద్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించి.. అభినందించారు. మిగతా వైద్యులు, సిబ్బంది వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. 20 మంది క్షయ బాధితులకు పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని పిలుపు నిచ్చారు. టీబీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, జిల్లాలోని అన్ని గ్రామాల్లో టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తిం చాలని, వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. టీబీ పేషంట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వైద్యం, మందులు, ఆర్థిక సహాయం ఇప్పించాలని ఆదేశించారు. పూర్తిగా నయం అయ్యే వరకు క్షయ బాధితులపై పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, వైద్యులు, సర్పంచులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీవో అధికారిగా పరిచయం.. సైబర్ మోసం

నిందితుడి అరెస్ట్

ప్రజానావ, వేములవాడ: ఆర్టీవో అధికారిగా ఫోన్‌లో తప్పుడు పరిచయం చేసుకుని డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ పేరుతో ఓ వ్యక్తి నుంచి రూ.4,200 కాజేసిన నిందితుడిని వేములవాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రూరల్ సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. హన్మాజిపేటకు చెందిన శ్రీనివాస్‌కు నిందితుడు నీరటి తిరుమల్ (32) ఫోన్ చేసి, లైసెన్స్ బ్లాక్ అవుతుందని భయపెట్టి మూడు విడతల్లో ఫోన్‌పే ద్వారా డబ్బులు బదిలీ చేయించుకున్నాడు. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి గురువారం వేములవాడలో అరెస్ట్ చేశారు. అతని నుంచి వివో మొబైల్, రెండు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఆర్టీవో కన్సల్టెన్సీలో పనిచేసిన అనుభవంతో మరికొందరినీ ఇదే విధంగా మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఉంటే రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్‌పై డబ్బులు బదిలీ చేయవద్దని, సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.



సీఎం బ్రేక్‌ఫాస్ట్‌తో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

- పాఠశాలల్లో హాజరు శాతం పెరిగింది
- మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రజానావ, మందమర్రి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించిన అనంతరం వారితో కలిసి మంత్రి అల్పాహారం భుజించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయమే పోషకాలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యంతో పాటు విద్యాభ్యాసం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. దేశంలోనే ఇలాంటి పథకం మరెక్కడా లేదని, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కొనియాడారు. పాఠశాలల్లో అల్పాహారం అందించడం వల్ల విద్యార్థుల హాజరు శాతం కూడా మరింత పెరిగిందన్నారు. ఉదయం పోషక విలువలతో కూడిన అల్పాహారం తీసుకోవడం వల్ల విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు చదువుపై మరింత ఏకాగ్రత సాధించి విద్యలో రాణించే అవకాశం ఉంటుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.



డొంగర్‌గావ్‌లో గాలివాన బీభత్సం

ప్రజానావ, ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలం డొంగర్‌గావ్ గ్రామంలో బుధవారం భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల తీవ్రతకు పలువురి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో బాధిత కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాన్ని సందర్శించి గాలివానకు నష్టపోయిన కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జహీర్, పట్టణ అధ్యక్షుడు జితేందర్, నాయకులు ప్రకాశ్, శేషనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి ఆరేళ్ల బాలుడి మృతి

- బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదం
- గాలింపు చేపట్టి మృతదేహం వెలికితీత

ప్రజానావ, వాజేడు: ఆరేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మృతి చెందిన విషాద ఘటన గురువారం ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి హేమంత్ (6) జాడి రేవంత్‌తో కలిసి గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం సమీప ప్రాంతానికి బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో బురదలో దిగిన హేమంత్ ప్రమాదవశాత్తు జారి గోదావరిలో పడిపోయాడు. అక్కడ లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఒడ్డున ఉన్న రేవంత్ భయంతో అక్కడి నుంచి ఇంటికి పరుగులు తీశాడు. పాఠశాలకు వెళ్లే సమయం దాటుతున్నా హేమంత్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గ్రామంలో అతడి కోసం గాలించారు. రేవంత్‌తో కలిసి వెళ్లినట్లు తెలుసుకుని అతడిని పిలిచి వివరాలు అడగగా, హేమంత్ గోదావరిలో పడిపోయినట్లు తెలిపాడు. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టి హేమంత్ మృతదేహాన్ని వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు.



చేతికొచ్చే పంటలు.. ఎండిపోతున్న దుర్భరం

- వర్షాభావం, సాగునీటి కొరతతో అన్నదాతల ఆందోళన
- విద్యుత్ కోతలతో మరింత నష్టం

ప్రజానావ, బోధన్ : జిల్లాలోని బోధన్ పురపాలిక, నవీపేట, రెంజల్, ధర్పల్లి ప్రాంతాల్లో చేతికొచ్చే దశలో ఉన్న పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలనినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు తోడు సాగునీటి కొరత, విద్యుత్ కోతలు పంటల ఎండిపోవడానికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. పంటలపై పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాంపూర్, లింగాపూర్, శాఖాపూర్ శివారులోని పొలాలకు నిజాంపూర్ ఎత్తిపోతల పథకం నుంచి సక్రమంగా నీరు అందకపోవడంతో సుమారు 80 ఎకరాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. శాఖాపూర్, లింగాపూర్ శివారులో మరో 185 ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇటీవల ఎత్తిపోతల పథకానికి అదనంగా మరో మోటారు ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నప్పటికీ, దీనివల్ల పూర్తిస్థాయిలో ప్రయోజనం ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రెంజల్, నీలా శివారుల్లో విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయి. మరో పది రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 16 గంటలపాటు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తే పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

కామారెడ్డిలో కుంటుపడిన అభివృద్ధి

- రాజకీయ విభేదాలు
- నిధుల కొరత.. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో సమస్యల సుడిగుండంలో పట్టణం



ప్రజానావ, కామారెడ్డి: దశాబ్దాలుగా వ్యవసాయ, వాణిజ్య కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు పొందిన కామారెడ్డి పట్టణం గత కొన్నేళ్లుగా కళ తప్పుతోంది. రాజకీయ విభేదాలు, నిధుల కొరత, పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పట్టణం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంగా విస్తరిస్తున్న కామారెడ్డి మున్సిపాలిటీలో పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయి. పురపాలకవర్గం ఏర్పడి దాదాపు ఏడాది పూర్తికావస్తున్నా అభివృద్ధి పనుల్లో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. కనీస వసతులు కొరవడటంతో పాటు గతేడాది సంభవించిన వరదల నష్టాల ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు రాబట్టడంలో స్థానిక నేతలు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నా యి. కొందరు స్థానిక నేతల మధ్య నెలకొన్న రాజకీయ వైరుధ్యాలు నిధుల మంజూరుపైనా ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. పురపాలకవర్గంలో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో మున్సిపల్ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఎజెండాల కు ఆమోదం లభించడం కష్టంగా మారుతోంది. పాలకవర్గంలో అంతర్గత విభేదాలు, కుమ్ములాటల కారణంగా కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి నెలకొందని పట్టణవాసులు పేర్కొంటున్నారు. మరోవైపు అధికారుల పర్యవేక్షణ లోపించ డంతో మున్సిపల్ యంత్రాంగం ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసినా గుంతలమయమైన రహదారులు, మూతపడిన డ్రైనేజీలు, పారిశుధ్య సమస్యలు దర్శనమిస్తున్నాయి. గతేడాది సంభవించిన భారీ వరదలు మిగిల్చిన నష్టాల నుంచి ఇప్పటికీ పురపాలిక పూర్తిగా కోలుకోలేదు. వరదల కారణంగా దెబ్బతిన్న మౌలిక వసతులను పునరుద్ధరించడంలో జాప్యం పాలకులు, అధికారుల వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు అభివృద్ధిలో వెనుకబడిన చుట్టుపక్కల జిల్లా కేంద్రాలు నేడు వేగంగా పురోగమిస్తుండగా, కామారెడ్డిలో మాత్రం అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని పట్టణవాసులు అంటున్నారు. గతేడాది వరదలతో పట్టణంలో అనేక రహదారులు ధ్వంసమయ్యాయి. కాల్వలు కొట్టుకుపోగా, డివైడర్లు దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతులు చేపట్టడంతోపాటు మొత్తం 104 పనులకు రూ.24.32 కోట్ల నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. అయితే వరదల అనంతరం ప్రభుత్వం కేవలం రూ.కోటి నిధులను మాత్రమే మంజూరు చేసింది. ఆ నిధులతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకొన్నారని విమర్శలు ఉన్నాయి. దీంతో ఏడాది కాలంగా దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి పురపాలికకు ఏటా సుమారు రూ.12 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు వచ్చే ఆదాయం సిబ్బంది జీతాలు, పురపాలిక నిర్వహణ ఖర్చులకే సరిపోవడం లేదు. దీనికితోడు ప్రభుత్వం నుంచి నిధులు నిలిచిపోవడంతో పట్టణ అభివృద్ధి అగమ్యగోచరంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



రష్యాలో ప్లేగు వ్యాప్తి వార్తలు అవాస్తవం

- మరో వ్యక్తి మృతిపై ప్రచారం తప్పుడు సమాచారం
- ప్రజలు అధికారిక ప్రకటనలనే విశ్వసించాలన్న క్రెమ్లిన్

మాస్కో: రష్యాలో ప్లేగు వ్యాధి వ్యాప్తిపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో మరో వ్యక్తి ఈ వ్యాధితో మరణించారంటూ వెలువడిన వార్తలను క్రెమ్లిన్ కొట్టిపారేసింది. ప్లేగు వ్యాప్తిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, అంటువ్యాధి ప్రబలే ప్రమాదం లేదని స్పష్టం చేసింది. సైబీరియాలోని యాంటీ ప్లేగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్న ఫిపిలోవా అనే మహిళ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె మరణానికి ప్రయోగశాల నుంచి లీకైన ప్లేగు బ్యాక్టీరియానే కారణమంటూ అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఇదే సమయంలో రష్యాలో మరో వ్యక్తి కూడా ప్లేగు వ్యాధి కారణంగా మృతిచెందారంటూ కొన్ని మీడియా సంస్థలు కథనాలు ప్రచురించడంతో ఆందోళనలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ.. ప్లేగు వ్యాప్తిపై వస్తున్న వార్తలు అసత్య ప్రచారమేనని స్పష్టం చేశారు. ఆరోగ్య విభాగం నుంచి అధికారికంగా వెలువడే సమాచారాన్నే ప్రజలు విశ్వసించాలని, తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన సూచించారు. రష్యాలో అంటువ్యాధి ప్రబలే ప్రమాదం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేయడంతో ప్లేగు వ్యాప్తిపై నెలకొన్న ఆందోళనలకు తెరపడినట్లైంది.

61 ఏళ్ల వయసులో ఐదు గంటల ప్లాంక్.. ప్రపంచ రికార్డు

- తన రికార్డును తానే బద్దలు కొట్టిన కెనడా మహిళ డోన్నాజీన్ వైల్డ్
- వయసు అడ్డంకి కాదని నిరూపణ



కెనడా: వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, సంకల్పం ఉంటే వయసుతో సంబంధం లేకుండా అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని కెనడాకు చెందిన 61 ఏళ్ల మహిళ డోన్నాజీన్ వైల్డ్ నిరూపించారు. కఠోర శ్రమ, పట్టుదలతో ఏకధాటిగా ఐదు గంటలపాటు అబ్డామినల్ ప్లాంక్ పొజిషన్‌లో ఉండి ప్రపంచ రికార్డు సృష్టించారు. హంట్స్‌మన్ వరల్డ్ సీనియర్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన ఈ ఈవెంట్‌లో ఐదు గంటలపాటు ప్లాంక్ పొజిషన్‌లో కొనసాగిన ఆమె గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ అసాధారణ ఫీట్‌తో ఆమె ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు. అంతేకాదు.. ఈ రికార్డు ఆమెకు కొత్తది కాదు. గతంలో తానే నెలకొల్పిన రికార్డును తానే బద్దలు కొట్టడం విశేషం. ఈ ఏడాది మార్చిలో అల్బెర్టాలో 4 గంటల 30 నిమిషాల 11 సెకన్ల పాటు ప్లాంక్ పొజిషన్‌లో ఉండి ఆమె రికార్డు నెలకొల్పారు. తాజాగా ఆ రికార్డును అధిగమించి ఏకంగా ఐదు గంటల మార్కును చేరుకున్నారు. స్టేజ్‌పై ఎంతో ఏకాగ్రతతో ప్లాంక్ చేస్తూ కొనసాగిన డోన్నాజీన్.. ఐదు గంటల సమయం పూర్తికాగానే ప్రేక్షకుల నుంచి పెద్ద ఎత్తున చప్పట్లు అందుకున్నారు. అనంతరం చిరునవ్వుతో తన విజయాన్ని ఆస్వాదించారు. ఈ అపురూప దృశ్యానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బెడ్‌పై ఎమ్మెల్యే.. తిలకం పెట్టిన పూజారి

- వీడియో తీస్తున్నారని గుర్తించి వెంటనే కిందకు
- పూలమాల, శాలువాలతో సత్కారం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో



పాట్నా: బిహార్‌లోని మొకామా జేడీయూ ఎమ్మెల్యే అనంత్ సింగ్ మరోసారి తనదైన శైలితో వార్తల్లో నిలిచారు. బెడ్‌పై హాయిగా పడుకుని ఉన్న ఆయనకు ఓ పూజారి నుదుటిపై తిలకం దిద్దుతున్న సమయంలో వీడియో రికార్డు చేస్తున్న విషయాన్ని గమనించి వెంటనే మంచం దిగి నిల్చున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజకీయ కార్యకలాపాలు, వివిధ ప్రకటనలు, చట్టపరమైన కేసుల కారణంగా గత కొన్నేళ్లుగా తరచూ వార్తల్లో నిలిచిన అనంత్ సింగ్‌ను 'ఛోటే సర్కార్'గా పిలుస్తుంటారు. తాజాగా ఆయనకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట్లో చర్చనీయాంశంగా మారింది. వీడియోలో అనంత్ సింగ్ బెడ్‌పై పడుకుని ఉండగా.. ఓ పూజారి ఆయన నుదుటిపై తిలకం దిద్దారు. అదే సమయంలో వీడియో తీస్తున్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే మంచం దిగి నిల్చున్నారు. అనంతరం పూజారి ఆయనకు పూలమాల వేయగా.. అక్కడున్న కొందరు వ్యక్తులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సత్కరించారు. ఆ తర్వాత ఓ వ్యక్తి నల్ల కళ్లజోడు ఇవ్వడంతో అనంత్ సింగ్ దాన్ని ధరించి తనదైన శైలిలో ఫోటోలకు పోజులిచ్చారు. ఈ మొత్తం ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఎమ్మెల్యే తీరుపై నెటిజన్ల నుంచి విమర్శలు, భిన్నమైన కామెంట్లు వెల్లువెత్తాయి.

ఎనిమిది యుద్ధాలు ఆపా

- శాంతి బహుమతికి అన్నివిధాలా అర్హుడినంటున్న అమెరికా అధ్యక్షుడు
- కమిటీ తనలాంటి వారికి పురస్కారం ఇవ్వదంటూ వ్యాఖ్యలు
- నేడు 2026 నోబెల్ శాంతి బహుమతి ప్రకటన



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నోబెల్ శాంతి బహుమతిపై తన ఆకాంక్షను బయటపెట్టుకున్నారు. తాను గొప్పలు చెప్పుకోవడం లేదని, ఇప్పటివరకు ఎనిమిది యుద్ధాలను ఆపినట్లు మరోసారి పేర్కొన్నారు. ఒకవైపు ఇరాన్‌తో అమెరికా యుద్ధం కొనసాగుతున్న సమయంలోనే తాను ఎనిమిది యుద్ధాలకు పరిష్కారం చూపినట్లు చెబుతూ నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ముందు తన వాదనలను తెరపైకి తెచ్చారు. ఇప్పటి వరకు ఏ అమెరికా అధ్యక్షుడూ చేయలేని పనులను తాను చేశానని, తాను గొప్పలు చెప్పడం లేదని, వాస్తవాలనే మాట్లాడుతున్నానని ట్రంప్ అన్నారు. గతంలో ఏ అధ్యక్షుడూ ఇన్ని యుద్ధాలకు పరిష్కారం చూపించి ఉండకపోవచ్చని పేర్కొన్నారు. తాను ఇప్పటికే ఎనిమిది యుద్ధాలను ఆపినందున నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు అన్నివిధాలా అర్హుడినని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ఈ పురస్కారం తనకు దక్కుతుందన్న నమ్మకం మాత్రం తక్కువేనని చెప్పారు. నోబెల్ కమిటీ నిర్ణయం ఏమిటో తనకు తెలియదని పేర్కొన్న ట్రంప్.. తనలాంటి వారికి నోబెల్ శాంతి పురస్కారం ఇవ్వకపోవడమే కమిటీకి అలవాటుగా ఉన్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. నోబెల్ శాంతి బహుమతిని ప్రతి ఏటా నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రదానం చేస్తుంది. 2026 నోబెల్ శాంతి బహుమతి విజేతను అక్టోబర్ 9న ప్రకటించనున్నారు. నోబెల్ కమిటీ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో శాంతి, సహకారం, అంతర్జాతీయ వ్యవస్థను బలోపేతం చేసే కృషిపై దృష్టి సారిస్తున్నట్లు కమిటీ కార్యదర్శి క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌వికెన్ ఇటీవల తెలిపారు. ఇదిలా ఉండగా, గత ఏడాది కూడా ట్రంప్ నోబెల్ శాంతి బహుమతిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోకు దక్కింది. వెనెజువెలాలో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఆమె చేసిన కృషి, నియంతృత్వం నుంచి న్యాయబద్ధమైన, శాంతియుత మార్పు కోసం చేసిన పోరాటాన్ని గుర్తిస్తూ నార్వేజియన్ నోబెల్ కమిటీ ఆమెను ఎంపిక చేసింది. దీంతో ట్రంప్ ఆశలు గత ఏడాది నెరవేరలేదు. ఈ ఏడాది నామినేషన్లలో ట్రంప్ పేరు ఉండవచ్చని గతంలో ప్రచారం జరిగిన నేపథ్యంలో, ఈసారి ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి ఎవరిని వరించనుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది. ట్రంప్ మాత్రం తాను ఎనిమిది సంఘర్షణలకు పరిష్కారం చూపినందున పురస్కారానికి అర్హుడినని పదేపదే చెబుతున్నారు. అయితే ఆయన పాత్రపై కొన్ని సంఘర్షణల్లోని పక్షాలు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది.

ఇరాన్‌తో యుద్ధం ముగిస్తే చమురు ధరలు భారీగా తగ్గుతాయి

- అణ్వాయుధం పొందకుండా ఇరాన్‌ను అడ్డుకోవడమే లక్ష్యం
- యుద్ధం నుంచి త్వరలోనే బయటకు వస్తామని ట్రంప్ సంకేతాలు

వాషింగ్టన్: ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం త్వరలోనే ముగిసే అవకాశం ఉందని, యుద్ధం ముగిసిన వెంటనే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భారీగా తగ్గుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో నిర్వహించిన రిపబ్లికన్ పార్టీ ప్రచారసభలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ అణు ముప్పును ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యలను సమర్థించుకున్నారు. అమెరికా సైనిక చర్యలు త్వరలోనే ముగిసే అవకాశం ఉందన్న సంకేతాలను ఇచ్చారు. తాము త్వరలోనే ఇరాన్‌తో యుద్ధం నుంచి బయటపడతామని, ఆ తర్వాత చమురు ధరలు అమాంతం కిందికి పడిపోతాయని అంచనా వేశారు. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగిన మాట వాస్తవమేనని, అయితే తాను ఊహించినంత స్థాయిలో అవి పెరగలేదని ట్రంప్ పేర్కొన్నారు. గత అమెరికా ప్రభుత్వాలు ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ఈ సమస్యను చాలా ఏళ్ల క్రితమే పరిష్కరించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇరాన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధం పొందనివ్వబోమని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఇరాన్‌తో ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. తన ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ ఈ వ్యవహారంలో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. అయితే యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తొందరలో ఏదో ఒక ఒప్పందాన్ని అంగీకరించేందుకు తాను సిద్ధంగా లేనని ట్రంప్ స్పష్టం చేశారు.

ఇరాన్ యుద్ధంలో అమెరికాకు భారీ నష్టం

- 81 విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు ధ్వంసం లేదా తీవ్రంగా దెబ్బతీత
- నష్టం విలువ రూ.27,500 కోట్లు
- పశ్చిమాసియాలో వైమానిక సామర్థ్యంపై పెరుగుతున్న ఒత్తిడి

వాషింగ్టన్: ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా సైన్యానికి చెందిన 81 విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు ధ్వంసమవడమో లేదా తీవ్రంగా దెబ్బతినడమో జరిగిందని కాంగ్రెషనల్ రిసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) తాజా నివేదిక వెల్లడించింది. న్యూయార్క్ పోస్ట్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ నష్టాల విలువ దాదాపు 3.3 బిలియన్ డాలర్లు, అంటే సుమారు రూ.27,500 కోట్ల వరకు ఉంటుందని అంచనా. అమెరికా సైన్యానికి చెందిన అత్యాధునిక యుద్ధ విమానాలు, కీలక నిఘా వ్యవస్థలు, గగనతలంలో ఇంధనం నింపే విమానాలతో పాటు భారీ సంఖ్యలో డ్రోన్లు దెబ్బతినడంతో పశ్చిమాసియాలో అమెరికా వైమానిక కార్యాచరణ సామర్థ్యంపై తీవ్ర ఒత్తిడి నెలకొంటున్నట్లు నివేదిక పేర్కొంది. యుద్ధ విమానాల విభాగంలో అమెరికా మొత్తం 12 ఎఫ్–15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్లను నష్టపోయినట్లు వెల్లడించింది.

చెన్నైలో కుంగిన రోడ్డు.. గొయ్యిలో పడిన కారు

- 10 అడుగుల గోతిలో వాహనం బోల్తా
- ఇద్దరు ప్రయాణికులు సురక్షితం
- మెట్రో పనులు జరుగుతున్న ప్రాంతంలో ఘటన

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలో గురువారం ఉదయం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. టైడల్ పార్క్ సమీపంలోని తిరువాన్మియూర్ రోడ్డు ఒక్కసారిగా కుంగిపోవడంతో రోడ్డుపై వెళ్తున్న ఓ కారు అకస్మాత్తుగా ఏర్పడిన భారీ గోతిలో పడిపోయింది. అయితే కారులో ఉన్న ఇద్దరు ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. టైడల్ పార్క్ సమీపంలో మెట్రో రైలు నిర్మాణ పనులు జరుగుతున్న మార్గంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ఒక్కసారిగా కుంగిపోవడంతో సుమారు 10 అడుగుల లోతైన గొయ్యి ఏర్పడింది. డ్రైవర్ స్పందించేలోపే కారు అదుపుతప్పి ఆ గోతిలో తలకిందులుగా పడిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని ఇద్దరు ప్రయాణికులు సురక్షితంగా బయటకు రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు కుంగిన ఘటనతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురికాగా.. ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గతంలోనూ తిరువాన్మియూర్ జంక్షన్ సమీపంలో ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. పాత డ్రైనేజీ పైప్‌లైన్ విఫలమవడంతో అప్పట్లో సుమారు ఆరు అడుగుల లోతైన గొయ్యి ఏర్పడి ఓ కారు అందులో పడిపోయింది. ఆ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. తాజాగా రోడ్డు కుంగిన విషయం తెలియడంతో మెట్రో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డు కుంగిపోవడానికి గల కారణాలపై అధికారులు పరిశీలిస్తున్నారు.

విదేశీ విద్యార్థులకు అమెరికాలో భారీ షాక్


- ఓపీటీకి ఒక్కో విద్యార్థిపై 70 వేల డాలర్ల ఫీజు ప్రతిపాదన
- రెన్యువల్, పొడిగింపునకు మరో 30 వేల డాలర్లు
- హెచ్–1బీ ఉల్లంఘనలకు రూ.2.4 కోట్ల వరకు జరిమానా



వాషింగ్టన్: అమెరికాలో చదువు పూర్తిచేసిన తర్వాత ఉద్యోగం చేయాలనుకునే విదేశీ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం కఠిన ఆంక్షలకు తెరతీసింది. విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) కింద ఉద్యోగం చేసేందుకు వీలుగా ప్రతి విద్యార్థి తరపున సంబంధిత విశ్వవిద్యాలయం 70 వేల డాలర్లు, అంటే రూ.58 లక్షలకు పైగా ఫీజుగా చెల్లించాలనే కొత్త నిబంధనను అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రతిపాదించింది. ఓపీటీ ప్రోగ్రామ్ రెన్యువల్ లేదా పొడిగింపునకు అదనంగా మరో 30 వేల డాలర్లు వసూలు చేయాలని కూడా ప్రతిపాదనలో పేర్కొంది. విదేశీ విద్యార్థుల ప్రవేశాలపై కఠిన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం అమెరికాలో డిగ్రీ పూర్తి చేసిన విదేశీ విద్యార్థులు తమ కోర్సుకు సంబంధించిన రంగంలో ఏడాది పాటు పనిచేసేందుకు ఓపీటీ అవకాశం కల్పిస్తోంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (ఎస్‌టీఈఎం) విభాగాల విద్యార్థులకు ఈ గడువును మరో రెండేళ్లు పొడిగించుకునే అవకాశం ఉంది. అయితే ప్రస్తుత వీసా వ్యవస్థలో మోసాలు జరుగుతున్నాయని, విదేశాల నుంచి వచ్చే చవకైన శ్రామిక శక్తిని అడ్డుకునేందుకే ఈ భారీ ఫీజులను ప్రతిపాదించినట్లు డీహెచ్ఎస్ తెలిపింది. తాజా ప్రతిపాదన అమల్లోకి వస్తే అమెరికాలోని విశ్వవిద్యాలయాలు, ఐటీ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రతిపాదనపై ప్రజలు 60 రోజులపాటు తమ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయవచ్చు. అనంతరం డీహెచ్ఎస్ దీనిని తుది నిబంధనగా ఆమోదించి అమల్లోకి తీసుకురావచ్చు. అయితే ఉన్నత విద్యా సంస్థలు లేదా వ్యాపార సంఘాలు ఈ ప్రతిపాదనను కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉండటంతో అమలులో జాప్యం జరిగే అవకాశమూ ఉంది. ఇదిలా ఉండగా, అమెరికాలో హెచ్–1బీ వీసా నిబంధనలను ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకునేందుకు అమెరికా ప్రతినిధుల సభలో మరో కొత్త చట్టాన్ని ప్రతిపాదించారు. టెక్సాస్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి బెత్ వాన్ డ్యూన్ ప్రవేశపెట్టిన 'హెచ్–1బీ వీసా ఫ్రాడ్ క్రాక్‌డౌన్ యాక్ట్' ప్రకారం వీసా నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించే సంస్థలపై భారీ జరిమానాలు విధించడంతోపాటు ఇమ్మిగ్రేషన్ కార్యక్రమాల్లో పాల్గొనకుండా గరిష్ఠంగా పదేళ్లపాటు నిషేధం విధించాలని ప్రతిపాదించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం స్థానిక అమెరికన్ కార్మికులను తొలగించి విదేశీ ఉద్యోగులను నియమించే తీవ్రమైన ఉల్లంఘనలకు విధించే గరిష్ఠ జరిమానా 35 వేల డాలర్లు, అంటే సుమారు రూ.3.4 లక్షలు మాత్రమే ఉంది. దీనిని ఏకంగా ఏడు రెట్లు పెంచి 2.5 లక్షల డాలర్లు, అంటే సుమారు రూ.2.4 కోట్లకు పెంచాలని తాజా బిల్లు ప్రతిపాదించింది. బాధ్యులైన కంపెనీలపై విధించే కనీస నిషేధ కాలాన్ని కూడా ప్రస్తుత మూడేళ్ల నుంచి పదేళ్లకు పెంచాలని బిల్లులో పేర్కొన్నారు.

సౌదీ విమానాశ్రయాలపై హౌతీల మిస్సైల్ దాడులు

- ముగ్గురు మృతి.. 36 మందికి గాయాలు
- బాలిస్టిక్ మిస్సైళ్లు, పేలుడు పదార్థాలతో డ్రోన్లతో దాడులు
- ఎదురుదాడులకు దిగిన సౌదీ కూటమి



రియాద్: సౌదీ అరేబియాపై హౌతీ తిరుగుబాటుదారుల దాడులు కొనసాగుతున్నాయి. సౌదీలోని విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని హౌతీలు జరిపిన దాడుల్లో ముగ్గురు మృతిచెందగా, 36 మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని సౌదీ విమానయాన శాఖ వెల్లడించింది. యెమెన్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారిన నేపథ్యంలో ఈ దాడులు చోటుచేసుకున్నాయి. యెమెన్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని సైన్యానికి సౌదీ అరేబియా మద్దతు ఇస్తుండగా, తిరుగుబాటుదారులైన హౌతీలకు ఇరాన్ మద్దతు ఇస్తోంది. దీంతో హౌతీలు సౌదీ అరేబియాను లక్ష్యంగా చేసుకుని వరుస దాడులకు పాల్పడుతున్నారు. రియాద్ విమానాశ్రయంపై జరిగిన మిస్సైల్ దాడిలో ఒకరు మృతిచెందగా, ఎనిమిది మంది గాయపడ్డారు. అభా విమానాశ్రయ ప్రాంతంపై జరిగిన మరో దాడిలో ఇద్దరు మృతిచెందగా, 28 మంది గాయపడ్డారు. మంగళవారం, బుధవారాల్లో ఈ దాడులు జరిగినట్లు సౌదీ ప్రభుత్వం తెలిపింది. మరోవైపు సౌదీ కూటమి సైన్యం కూడా హౌతీలపై ఎదురుదాడులకు దిగింది. హౌతీలను శిక్షించకుండా వదిలిపెట్టబోమని సౌదీ ప్రభుత్వం ప్రకటించింది. సౌదీలోని వైమానిక స్థావరాలు, విమానాశ్రయాలే లక్ష్యంగా హౌతీలు దాడులు చేస్తున్నారని తెలిపింది. బాలిస్టిక్ మిస్సైళ్లతోపాటు భారీ పేలుడు పదార్థాలను మోసుకెళ్లే డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించింది. తాము సౌదీపై దాడులు చేసిన విషయాన్ని హౌతీలు కూడా ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా.. యెమెన్‌లోని అడెన్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనా హౌతీలు దాడి చేశారు. కైరో విమానం రన్‌వేపై దిగడానికి కొన్ని నిమిషాల ముందు అక్కడి రన్‌వేపై మిస్సైల్ దాడి జరిగింది. అంతర్జాతీయ నౌకా రవాణాకు అత్యంత కీలకమైన బాబ్ ఎల్ మండేబ్ జలసంధి మార్గంలోనూ దాడి చోటుచేసుకుంది. ఒకవైపు ఇరాన్–అమెరికా యుద్ధం కొనసాగుతుండగా.. మరోవైపు సౌదీ అరేబియా, యెమెన్ హౌతీల మధ్య కూడా ఘర్షణలు తీవ్రరూపం దాల్చడం ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది.


కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

- మెయిల్ ద్వారా హెచ్చరిక
- లోపల, బయట భద్రతా బలగాల విస్తృత తనిఖీలు
- ప్రయాణికులు, లగేజీ కూడా పరిశీలన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు రావడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. గురువారం మెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదిరింపులో విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు పేర్కొన్నారని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే భద్రతా విభాగానికి చెందిన సిబ్బంది విమానాశ్రయ పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విమానాశ్రయం లోపల, వెలుపల తనిఖీలు నిర్వహించడంతోపాటు ప్రయాణికులు, వారి లగేజీని కూడా పరిశీలించారు. గతంలోనూ కోల్‌కతా విమానాశ్రయానికి పలుమార్లు బాంబు బెదిరింపులు వచ్చినప్పటికీ, తనిఖీల అనంతరం అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని తేలింది. అయినప్పటికీ ప్రస్తుత బెదిరింపును అధికారులు తేలిగ్గా తీసుకోకుండా నిర్దిష్ట భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అన్ని రకాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఈ బెదిరింపు మెయిల్‌ను ఎవరు పంపారు? ఎక్కడి నుంచి వచ్చింది? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. గత ఫిబ్రవరి నుంచి కోల్‌కతా విమానాశ్రయానికి పలు బెదిరింపులు వచ్చినట్లు సమాచారం.

భూగోళాన్ని ఉడికిస్తున్న ఎల్‌నినో

- మరింత బలపడనున్న ఎల్‌నినో పరిస్థితులు
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఫిబ్రవరి 2027 వరకు ప్రభావం ఉండే అవకాశం



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితులు మరింత బలపడనున్న నేపథ్యంలో భూగోళంపై ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగనున్నాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా వేడి వాతావరణం నెలకొని ఉండగా.. భూగోళం మండుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ కూడా ఈ పరిణామాలపై హెచ్చరిక జారీ చేసింది. 1950 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా ప్రస్తుత పరిస్థితులు మారే అవకాశం ఉందని పేర్కొంది. మానవ కార్యకలాపాల కారణంగా ఇప్పటికే ప్రభావితమవుతున్న వాతావరణ వ్యవస్థకు ఎల్‌నినో పరిస్థితులు తోడవుతున్నాయని ఐక్యరాజ్యసమితి తెలిపింది. పసిఫిక్ మహాసముద్రం నుంచి భారీగా వేడి ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో ప్రపంచం లోని పలు ప్రాంతాల్లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వాతావరణ నిపుణుడు ర్యాన్ మాపూ విడుదల చేసిన క్లైమేట్ మ్యాప్‌లో భూగోళం మొత్తం ఎర్రగా మారినట్లు కనిపిస్తోంది. ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికా మినహా దాదాపు అన్ని ప్రాంతాల్లో భూమి వేడెక్కుతున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2027 వరకు ఎల్‌నినో ప్రభావం కొనసాగే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ ఇచ్చిన నివేదికను ఆయన సమర్థించారు. మరో వాతావరణ నిపుణుడు జేకీ హాజ్‌ఫాదర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో భూగోళంపై ఉష్ణోగ్రతలు 3.4 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మరో నిపుణుడు లియోన్ సైమన్ స్పందిస్తూ ప్రపంచం 'సూపర్ డూపర్ ఎల్‌నినో' దశలోకి వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సెంట్రల్, ఈస్టర్న్ పసిఫిక్ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 3.7 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగవచ్చని పేర్కొంది. ఈ ఏడాది ఏర్పడే సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో జూన్ 2026 నుంచి ఫిబ్రవరి 2027 వరకు ప్రపంచ వ్యాప్తంగా సాధారణం కంటే సుమారు 5 లక్షల అదనపు మరణాలు నమోదయ్యే అవకాశం ఉందని చికాగో విశ్వవిద్యాలయ పరిశోధకులు అంచనా వేసినట్లు సమాచారం. మొత్తంగా ఎల్‌నినో ప్రభావం బలపడుతున్న కొద్దీ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వేడి, మారుతున్న వాతావరణ పరిస్థితులు మానవాళికి సవాలుగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆసీస్‌ను రెచ్చగొట్టేలా.. శాండ్‌పేపర్ స్కాండల్ వీడియో టెలికాస్ట్



కేప్‌టౌన్: 2018 శాండ్ పేపర్ స్కాండల్ గుర్తుంది కదా.. ప్రపంచ క్రికెట్‌ను కుదుపేసిన ఘటన. ఏకంగా ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ఉన్న స్టీవ్ స్మిత్‌పై వేటు పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా తొలిసారి దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోంది. శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య మొదటి టెస్టు ప్రారంభం కానుంది. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా బ్రాడ్‌కాస్టర్ సూపర్‌స్పోర్ట్ మళ్లీ శాండ్‌పేపర్‌ను ఘటనను గుర్తు చేస్తూ వీడియోను టెలికాస్ట్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 'ఈ మూడు టెస్టుల సిరీస్ కోసం మా కెమెరాలు చాలా షార్ప్‌గా ఉంటాయి' అని సూపర్‌స్పోర్ట్ క్యాప్షన్ ఇచ్చింది.

అప్పుడేం జరిగిందంటే?

కేప్‌టౌన్ వేదికగా 2018 మార్చిలో దక్షిణాఫ్రికా – ఆస్ట్రేలియాజట్ల మధ్య మూడో టెస్టు మ్యాచ్ జరిగింది. మూడో రోజు ఆట సందర్భంగా ఆసీస్ ఆటగాడు కామెరూన్ బ్యాన్‌క్రాఫ్ట్ బంతిని షైనింగ్ తెప్పించేందుకు శాండ్‌పేపర్‌ను వినియోగించాడు. ఇది కెమెరాల్లో పడింది. ఆ విషయం తెలిసినా అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ అడ్డుకోలేదు. దీంతో స్మిత్, వార్నర్‌పై ఏడాదిపాటు వేటు పడింది. బ్యాన్‌క్రాఫ్ట్ తొమ్మిది నెలలపాటు నిషేధం ఎదుర్కొన్నాడు. ఆ తర్వాత బ్యాన్‌క్రాఫ్ట్ జట్టుకు దూరం కాగా.. స్మిత్, వార్నర్ మాత్రం కీలక ప్లేయర్లుగా మారారు. ఇప్పుడు వార్నర్ అంతర్జాతీయ క్రికెట్‌లో లేడు. స్మిత్ మాత్రం కొనసాగుతున్నాడు.

ఆ 'ఓపెనర్' కోసం రాంచీ మ్యాచ్‌కు ధోనీ!

రాంచీ: భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని ప్రస్తుతం కేవలం ఐపీఎల్‌లోనే కొనసాగుతున్నాడు. గత సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అయినా సరే వచ్చే ఎడిషన్‌లో అతడిని మైదానంలో చూస్తామని అభిమానులు ఆశగా ఉన్నారు. ఈ క్రమంలో ధోనీని చూసే అవకాశం ఫ్యాన్స్‌కు మరో రూపంలో రాబోతోంది. రాంచీ వేదికగా వెస్టిండీస్‌తో టీమ్ఇండియా శుక్రవారం రెండో టీ20 మ్యాచ్‌లో తలపడనుంది. మహీ సొంతూరు 'రాంచీ'నే కదా..! దీంతో ఈ మాజీ కెప్టెన్ మ్యాచ్‌కు వస్తాడని ప్రచారం సాగుతోంది. మరోవైపు ఐపీఎల్‌కు (IPL 2027) సంబంధించి ఓ డీల్ కూడా చేసుకోబోతున్నాడనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఈశాన్, వైభవ్ దూకుడు

- రాంచీ నెట్స్‌లో బౌండరీల మోత
- రెండో టీ20కి భారత్ సన్నద్ధం

రాంచీ: వెస్టిండీస్‌తో రెండో టీ20కి ముందు భారత జట్టు ముమ్మర సాధన చేసింది. సొంతగడ్డపై ఆడనున్న జార్ఖండ్ ఆటగాడు ఈశాన్ కిషన్, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ నెట్స్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. పచ్చని కొండల మధ్య చల్లని వాతావరణంలో సాగిన సాధనలో ఈ ఇద్దరి బ్యాటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జార్ఖండ్ కెప్టెన్ అయిన ఈశాన్ కిషన్ జేఎస్‌సీఏ స్టేడియంలో స్పిన్నర్లను ఎదుర్కొంటూ పలుమార్లు బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. రవి బిష్ణోయ్, నామన్ ధీర్, అభిషేక్ శర్మ అతడికి బౌలింగ్ చేశారు. మరో నెట్‌లో సంజూ శాంసన్ ఓపికగా బ్యాటింగ్ చేస్తూ చక్కని షాట్లు ఆడాడు. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్లో హర్యానాపై 49 బంతుల్లో 101 పరుగులు చేసి జార్ఖండ్‌కు తొలి టైటిల్ అందించిన ఈశాన్.. జాతీయ జట్టులోకి పునరాగమనంతో మంచి ఫామ్‌లో ఉన్నాడు. అయితే నెట్స్‌లో అందరి దృష్టినీ ఆకర్షించింది బిహార్‌కు చెందిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. పోలీసులు, ప్రేక్షకులు, మీడియా ప్రతినిధులు అతడి బ్యాటింగ్‌ను ఆసక్తిగా గమనించారు. వరుసగా బౌండరీలు బాదుతూ స్టాండ్స్, సైట్‌స్క్రీన్ వైపు బంతులను తరలించాడు. ప్రస్తుతం ఓపెనర్‌గా సంజూ శాంసన్ ఉండటంతో సూర్యవంశీ అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు.



మయాంక్‌కు విశ్రాంతి

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ ఐచ్ఛిక సాధనకు దూరంగా ఉండగా, మిగతా ఆటగాళ్లు దాదాపు రెండు గంటలు సాధన చేశారు. తొలి మ్యాచ్‌లో ప్రభావం చూపలేకపోయిన పేసర్ మయాంక్ యాదవ్‌కూ విశ్రాంతినిచ్చారు. బౌలింగ్ కూర్పుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని సహాయ కోచ్ సితాన్షు కొటక్ తెలిపారు. జట్టులోని 15 మందికీ అవకాశం ఉందన్నారు. లక్నోలో జరిగిన తొలి టీ20లో ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచిన భారత్.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–0 ఆధిక్యం కోసం సిద్ధమవుతోంది. వికెట్ మారినా భయంలేని ఆటతీరు, జట్టు ప్రయోజనానికి ప్రాధాన్యం ఇచ్చే విధానం కొనసాగుతుందని కొటక్ స్పష్టం చేశారు.

కొత్త కెప్టెన్‌తో పాక్ టీ20 సీజన్

- శ్రీలంకతో నేటి నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్
- కెప్టెన్‌గా సాహిబ్‌జాదా ఫర్హాన్‌కు తొలి సవాల్

రావల్పిండి: పాకిస్థాన్ కొత్త టీ20 సీజన్‌ను కొత్త కెప్టెన్ సాహిబ్‌జాదా ఫర్హాన్‌తో ప్రారంభించనుంది. శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ శుక్రవారం జరుగుతుంది. గత రెండేళ్లలో పాకిస్థాన్‌కు బాబర్ ఆజమ్, షహీన్ అఫ్రిది, సల్మాన్ అలీ ఆఘా టీ20 కెప్టెన్లుగా వ్యవహరించగా.. 2028 టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా సెలక్టర్లు కొత్త బృందాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇటీవల జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో పాకిస్థాన్‌కు రజత పతకం అందించిన ఫర్హాన్.. తొలిసారి టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు చేపడుతున్నాడు. ఈ కొత్త సవాల్‌పై ఉత్సాహంగా ఉన్నానని, సిరీస్ గెలిచేందుకు ప్రయత్నిస్తామని అతడు చెప్పాడు. రావల్పిండిలోనే ఐదు రోజుల్లో మూడు టీ20లు జరగనున్నాయి. అనంతరం ఇంగ్లండ్ చేరడంతో అక్టోబరు 18 నుంచి రావల్పిండి, లాహోర్‌లలో వన్డే ముక్కోణపు సిరీస్ జరుగుతుంది.



ఫకర్, షదాబ్‌ల పునరాగమనం

ఆసియా క్రీడలకు దూరమైన ఫకర్ జమాన్, పేసర్ నసీమ్ షా, ఆల్‌రౌండర్ షదాబ్ ఖాన్ తిరిగి జట్టులోకి వచ్చారు. యువ ఆటగాళ్లతో పాటు వీరి అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని ఫర్హాన్ చెప్పాడు. గత కెప్టెన్లకు టీ20 జట్టు తలుపులు మూసుకుపోలేదని, వారు ఎప్పుడైనా తిరిగి రావచ్చని స్పష్టం చేశాడు. ఇక ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను 0–3తో కోల్పోయిన శ్రీలంక భారీ మార్పులతో బరిలోకి దిగుతోంది. చరిత్ అసలంక, దిల్షాన్ మదుషంక, జనిత్ లియానగేలకు చోటు దక్కలేదు. గాయం కారణంగా స్టార్ లెగ్‌స్పిన్నర్ వనిందు హసరంగ కూడా సిరీస్‌కు దూరమయ్యాడు. కొత్త టెస్టు కెప్టెన్‌గా ఎంపికైన కుశాల్ మెండిస్ టీ20 జట్టుకూ నాయకత్వం వహిస్తున్నాడు. పాకిస్థాన్‌లో బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు ఉంటాయని, ఇంగ్లండ్‌తో పోలిస్తే పరిస్థితులు భిన్నంగా ఉంటాయని మెండిస్ ఆశాభావం వ్యక్తం చేశాడు. 2019లో అనుభవం లేని దసున్ శనక నేతృత్వంలో పాకిస్థాన్ గడ్డపై 3–0తో టీ20 సిరీస్ గెలిచిన ఏకైక జట్టు శ్రీలంకే. అయితే పాకిస్థాన్ పేస్ దళంలోని అన్‌క్యాప్డ్ సంచలనం రజాఉల్లా నుంచి ముప్పు పొంచి ఉందని మెండిస్ భావిస్తున్నాడు

ఆర్కిటిక్ ఓపెన్‌లో సింధు జోరు!

- క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లిన హైదరాబాద్ స్టార్
- తరుణ్, తన్వి, శ్రీకాంత్‌లకు నిరాశ



వాంటా (ఫిన్లాండ్): రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. అయితే భారత పురుషుల సింగిల్స్ ఆటగాళ్లు తరుణ్ మన్నెపల్లి, కిదాంబి శ్రీకాంత్, మహిళల విభాగంలో తన్వి శర్మ పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో జపాన్‌కు చెందిన రికో గుంజీపై ఆరో సీడ్ సింధు 21–15, 21–15 తేడాతో గెలిచింది. క్వార్టర్స్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన టాప్ సీడ్, మాజీ ప్రపంచ ఛాంపియన్ రట్చనోక్ ఇంతనాన్‌తో తలపడనుంది. జూలైలో జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ గెలిచిన సింధు అదే జోరును కొనసాగిస్తోంది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ ఫ్రాన్స్ ఆటగాడు క్రిస్టో పొపోవ్.. తరుణ్ మన్నెపల్లిని 21–14, 21–19తో ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో రట్చనోక్ ఇంతనాన్.. తన్వి శర్మను 21–18, 21–7తో చిత్తు చేసింది. మాజీ ప్రపంచ నంబర్‌వన్ కిదాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే కెనడాకు చెందిన బ్రయాన్ యాంగ్ చేతిలో 21–15, 15–21, 13–21తో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్ గరగ, వృధ్వి కృష్ణమూర్తి రాయ్ జోడీ ఇంగ్లండ్‌కు చెందిన ఒలివర్ బట్లర్, శామ్యూల్ జోన్స్‌తో తలపడనుంది. 5 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీతో ఈ సూపర్ 500 టోర్నీ జరుగుతోంది.

ఒడిశా హాకీసంఘానికి షోకాజ్

- నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు
- శాశ్వత సభ్యత్వం నుంచి అసోసియేట్ సభ్యత్వానికి ప్రతిపాదన

భువనేశ్వర్: జాతీయ సమాఖ్య నిబంధనలను పాటించలేదన్న ఆరోపణలపై హాకీ ఇండియా.. హాకీ అసోసియేషన్ ఆఫ్ ఒడిశా (హెచ్‌ఏఓ)కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. సంఘాన్ని శాశ్వత సభ్యత్వం నుంచి అసోసియేట్ సభ్యత్వానికి మార్చే ప్రతిపాదనను కూడా చేసింది. అక్టోబరు 6న జరిగిన హాకీ ఇండియా కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల అధికారి ప్రతికూల నివేదిక ఇవ్వడంతో అక్టోబరు 3న జరగాల్సిన హెచ్‌ఏఓ ఎన్నికలు నిలిచిపోయాయి. సంఘం పనితీరుపై హాకీ ఇండియా ఎనిమిది అంశాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఒడిశాలోని 30 జిల్లా హాకీ సంఘాల్లో అధ్యక్షుడు, కార్యదర్శి వంటి కీలక పదవుల్లో జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు వంటి అధికారులు ఎక్స్‌అఫిషియో హోదాలో కొనసాగుతున్నారని హాకీ ఇండియా పేర్కొంది. ఎన్నికల ద్వారా పాలకవర్గాలను ఏర్పాటు చేసినట్లు నిరూపించే ఎన్నికల నోటీసులు, సమావేశాల తీర్మానాలు, ఫలితాలను ఏ జిల్లా సంఘం కూడా సమర్పించలేదని తెలిపింది. దీంతో హెచ్‌ఏఓ ఎన్నికల ఓటర్ల జాబితా ఖరారు చేయడం కూడా సాధ్యం కాలేదని పేర్కొంది.

రెండు వారాల గడువు

ఎన్నికలకు సంబంధించిన ఆధారాలు, అవసరమైన చట్టబద్ధ అనుమతులతో సహా పూర్తి పత్రాలను సమర్పించేందుకు హెచ్‌ఏఓకు రెండు వారాల గడువు ఇచ్చారు. గడువులోగా స్పందించకపోతే హాకీ ఇండియా అనుబంధ కమిటీ, ఆ తర్వాత సాధారణ సభ ద్వారా సభ్యత్వ పునర్వర్గీకరణపై చర్యలు చేపట్టే అవకాశం ఉంది. హాకీ ఒడిశా ప్రధాన కార్యదర్శి ప్రతాప్ సత్పతి ఈ చర్యను స్వాగతిస్తూ, రాష్ట్రంలో హాకీ పాలన పారదర్శకంగా ఉండేలా ఒడిశా ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు.

Business బిజినెస్

భారత్‌లో తొలిసారి రోల్స్‌రాయిస్ బోర్డు భేటీ

- రక్షణ, ఏరోస్పేస్, ఇంధన రంగాల్లో భాగస్వామ్య విస్తరణపై దృష్టి
- అమ్మా యుద్ధ విమాన ఇంజిన్ అభివృద్ధిలో కీలక భాగస్వామ్యం



న్యూఢిల్లీ: బ్రిటన్‌కు చెందిన రక్షణ, ఏరోస్పేస్ దిగ్గజం రోల్స్‌రాయిస్ తొలిసారిగా భారత్‌లో బోర్డు సమావేశం నిర్వహించింది. భారత్‌కు పెరుగుతున్న వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని ఇది ప్రతిబింబిస్తోందని సంస్థ తెలిపింది. సీఈఓ టుఫాన్ ఎర్గిన్‌బిల్గిక్ ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అనంతరం రక్షణ, ఏరోస్పేస్, ఇంధన రంగాల్లో దీర్ఘకాలిక భాగస్వామ్యంపై చర్చించారు. భారత్‌లో తదుపరి తరం యుద్ధవిమాన ఇంజిన్ అభివృద్ధితోపాటు రక్షణ, ఇంధన రంగాల్లో వ్యాపారాన్ని విస్తరించాలని రోల్స్‌రాయిస్ భావిస్తోంది. రోల్స్‌రాయిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కలిసి అమ్మా కార్యక్రమం కోసం స్వదేశీ యుద్ధవిమాన ఇంజిన్ అభివృద్ధికి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. భారత్‌లో ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి ఇంజిన్ రూపకల్పన నుంచి తయారీ, పరీక్షలు, నిర్వహణ వరకు పూర్తి వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఇది భవిష్యత్ సైనిక, నౌకాదళ, పౌర విమానయాన అవసరాలకు ఉపయోగపడే స్వదేశీ సామర్థ్యాన్ని పెంచనుంది. బెంగళూరులోని రోల్స్‌రాయిస్ గ్లోబల్ కెపాబిలిటీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను బోర్డు సభ్యులు సందర్శించారు. హెచ్‌ఏఎల్, ఫోర్స్ మోటార్స్‌తో తయారీ భాగస్వామ్యాలతోపాటు టాటా, భారత్ ఫోర్జ్, గోద్రెజ్ తదితర 100కుపైగా దేశీయ సరఫరాదారులతో సంస్థకు సంబంధాలున్నాయి.

జీఎస్టీలో కీలక సంస్కరణలు

- పన్ను అధికారుల అరెస్టు అధికారం రద్దు
- ప్రాసిక్యూషన్ పరిమితి రూ.5 కోట్లకు పెంపు
- త్వరిత, ఆటోమేటెడ్ రీఫండ్లు
- సాధారణ జరిమానా రూ.25వేల నుంచి రూ.10 వేలకు తగ్గింపు

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారులకు మరింత సౌలభ్యం కల్పించే దిశగా వస్తు, సేవల పన్ను మండలి (జీఎస్టీ కౌన్సిల్) కీలక నిర్ణయాలు తీసుకుంది. పన్ను అధికారులకు ఉన్న అరెస్టు అధికారాన్ని తొలగించడంతో పాటు.. పన్ను ఎగవేతకు సంబంధించి ప్రాసిక్యూషన్‌కు కనీస పరిమితిని ప్రస్తుత రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచింది. రీఫండ్లను వేగంగా, సాధ్యమైనంతవరకు ఆటోమే టెడ్‌గా జారీ చేసే విధానానికి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేసినా, పొరపాటు జరిగినా, పన్ను చెల్లింపులో జాప్యం చేసినా.. పన్ను రికవరీ, వడ్డీ, దానికి అనుగుణమైన జరిమానాతోనే పరిమితం చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ప్రత్యేక జరిమానా నిర్దేశించని సందర్భాల్లో విధించే సాధారణ జరిమానాను రూ.25 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించింది. రూ.10 వేల కంటే తక్కువ మొత్తాలకు సంబంధించి నోటీసులు జారీ చేయకూడదని నిర్ణయించింది. జీఎస్టీ కేసుల్లో కనీస శిక్షను కూడా తొలగించాలని కౌన్సిల్ సిఫారసు చేసింది. జరిమానా, జైలు శిక్ష లేదా రెండింటిలో ఏది విధించాలన్నది ఇక ప్రతి కేసులో న్యాయస్థానం విచక్షణకు వదిలేయనుంది. ఇక విలోమ పన్ను నిర్మాణం కింద ఇచ్చే రీఫండ్ సొకర్యాన్ని ఇన్‌పుట్ సేవలకు కూడా విస్తరించాలని నిర్ణయించారు. 2026 నవంబరు 1 లేదా ఆ తర్వాత పొందిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు ఈ మార్పు వర్తిస్తుంది. బహుళ రాష్ట్రాల్లో నమోదైన కేంద్ర జీఎస్టీ పన్ను చెల్లింపుదారులకు ముఖరహిత పన్ను మదింపు విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.



రేట్లలో మార్పు లేదు

57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఎలాంటి జీఎస్టీ రేట్లను మార్చలేదని సీతారామన్ స్పష్టం చేశారు. వ్యాపార నిర్వహణ సౌలభ్యానికి, పన్ను రేట్లలోని అసమానతలకు సంబంధించి దాదాపు 99 శాతం సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. జీఎస్టీ సంస్కరణలను విశ్వాసం అనే సూత్రం ఆధారంగా ముందుకు తీసుకెళ్తున్నామని, వ్యాపారులు, పన్ను చెల్లింపుదారులపై అనవసరంగా జోక్యం చేసుకోకుండా విశ్వసనీయ వాతావరణం కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

జీఎస్టీ రేట్లకు కత్తెర

వస్తు, సేవల పన్ను రేట్ల హేతుబద్ధీకరణ తర్వాత జీఎస్టీ సగటు రేటు 10.84 శాతానికి తగ్గింది. 2023లో ఇది 11.4 శాతంగా ఉండగా, 2017లో జీఎస్టీ అమలైనప్పుడు ఆదాయ తటస్థ రేటు 15.8 శాతంగా ఉంది. గత సెప్టెంబరులో జీఎస్టీ మండలి 5, 12, 18, 28 శాతం నాలుగు శ్లాబులను 5, 18 శాతం రెండు శ్లాబులకు కుదించింది. విలాస, పాపపు వస్తువులకు 40 శాతం రేటును నిర్ణయించింది. రేట్ల తగ్గింపు ఉన్నప్పటికీ జీఎస్టీ ఆదాయం పెరుగుతోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో జీఎస్టీ వసూళ్లు 11.6 శాతం పెరిగి రూ.12.46 లక్షల కోట్లకు చేరాయి. కాగా, రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై వ్యాపారి డిస్కౌంట్ రేటుకు జీఎస్టీ విధించే అంశాన్ని 57వ జీఎస్టీ మండలి సమావేశంలో చర్చించలేదని సీతారామన్ వెల్లడించారు.

చమురు సెగకు మార్కెట్లు కుదేలు

- ఒక్కరోజే రూ.10.02 లక్షల కోట్ల సంపద ఆవిరి
- రెండున్నరేళ్ల కనిష్ఠానికి సెన్సెక్స్

న్యూఢిల్లీ: ముడిచమురు ధరలు భారీగా పెరగడం, దేశీయంగా–అంతర్జాతీయంగా వడ్డీరేట్లు మరింత కఠినతరం కావచ్చన్న ఆందోళనలతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కుప్పకూలాయి. బీఎస్‌ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.10,01,898.68 కోట్లు తగ్గి రూ.4,60,97,032 కోట్లకు పడిపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.10.02 లక్షల కోట్లు ఆవిరైంది. సెన్సెక్స్ 1,045 పాయింట్లు (1.44 శాతం) నష్టపోయి 71,593.24 వద్ద ముగిసింది. ఇది రెండున్నరేళ్లకు పైగా కాలంలో కనిష్ఠ ముగింపు. ఇంట్రాడేలో 1,310.95 పాయింట్లు (1.80 శాతం) పతనమై 71,327.75కి చేరింది. ఈ ఏడాది ఇప్పటివరకు సెన్సెక్స్ 13,627.36 పాయింట్లు (16 శాతం), నిఫ్టీ 3,897.8 పాయింట్లు (14.91 శాతం) నష్టపోయాయి. మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో బ్రెంట్ క్రూడ్ 4.25 శాతం ఎగబాకి బ్యారెల్‌కు 104.5 డాలర్లకు చేరింది. దీంతో దిగుమతి ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. రూపాయి బలహీనత, అమెరికా పదేళ్ల ట్రెజరీ ఈల్డ్ 5.3 శాతం వద్ద ఉండటం కూడా మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.6,121.37 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. కఠిన ద్రవ్య విధానం, అధిక బాండ్ ఈల్డ్‌లు, రూపాయి పతనం, చమురు ధరల పెరుగుదల మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు తెలిపారు.

అన్ని రంగాల్లో నష్టాలే

బీఎస్‌ఈలో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. పవర్ 3.51 శాతం, మెటల్ 3.34 శాతం, యుటిలిటీస్ 3.38 శాతం, రియల్టీ 3.07 శాతం, క్యాపిటల్ గూడ్స్ 3.02 శాతం చొప్పున పడిపోయాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 2.58 శాతం, మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 2.53 శాతం క్షీణించాయి. మొత్తం 3,426 షేర్లు నష్టపోగా, 1,003 లాభపడ్డాయి; 225 షేర్లలో మార్పు లేదు.

విమాన ప్రయాణానికి ఇంధన సెగ

- ఆకాశ ఎయిర్ సర్‌చార్జి పునరుద్ధరణ
- దేశీయ టికెట్‌పై రూ.375 నుంచి 1,150 అదనపు భారం



న్యూఢిల్లీ: విమాన ప్రయాణికులపై ఇంధన భారం మరోసారి పెరగనుంది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు వరుసగా పెరుగుతున్న నేపథ్యంలో ఆకాశ ఎయిర్ దేశీయ విమాన సర్వీసులపై ఇంధన సర్‌చార్జిని పునరుద్ధరించింది. అంతర్జాతీయ సర్వీసులపై సర్‌చార్జిని కూడా పెంచింది. కొత్త ఛార్జీలు అక్టోబరు 9 నుంచి అమల్లోకి రానున్నాయి. దేశీయ సర్వీసుల్లో ప్రయాణ దూరాన్ని బట్టి ఒక్కో ప్రయాణికుడిపై రూ.375 నుంచి రూ.1,150 వరకు సర్‌చార్జి విధించనుండగా.. అంతర్జాతీయ సర్వీసులకు రూ.2,500గా నిర్ణయించింది. మార్చిలో దేశీయ, అంతర్జాతీయ విమానాలకు ఇంధన సర్‌చార్జిని ప్రవేశపెట్టిన ఆకాశ ఎయిర్.. ఆ తర్వాత దేశీయ సర్వీసులపై దాన్ని ఉపసంహరించుకుంది. ఇప్పుడు ఏటీఎఫ్ ధరల పెరుగుదల నేపథ్యంలో మళ్లీ అమల్లోకి తెచ్చింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న భౌగోళిక–రాజకీయ పరిణామాల ప్రభావంతో ఏటీఎఫ్ ధరలు పెరుగుతున్నాయని సంస్థ తెలిపింది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఇంధనం కీలక భాగమని, ధరల పెరుగుదలతో ఖర్చులపై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొంది. ఈ అదనపు భారాన్ని కొంతమేర భర్తీ చేసుకునేందుకే సర్‌చార్జి విధిస్తున్నట్లు వెల్లడించింది. ఆకాశ ఎయిర్‌కు ముందే ఇండిగో, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా ఇంధన సర్‌చార్జి పెంపును ప్రకటించాయి

ఏఐ దూరమే భారత్‌కు బలం

- ఏడాదిలో అదే భారత ఈక్విటీలకు సానుకూలతగా మారొచ్చు
- ఏఐ జోరు తగ్గితే భారత్ వైపు ప్రపంచ మూలధనం
- ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్

ముంబై: భారత ఈక్విటీల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై పెద్దగా పెట్టుబడి అవకాశాలు లేకపోవడాన్ని విదేశీ పెట్టుబడిదారులు ప్రస్తుతం ప్రతికూలంగా చూస్తున్నప్పటికీ.. ఏడాదిలో అదే భారత్‌కు బలంగా మారొచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. ఏఐ ఆధారిత పెట్టుబడుల జోరు తగ్గితే.. ఏఐతో సంబంధం లేని వృద్ధి అవకాశాల కోసం ప్రపంచ మూలధనం చూస్తుందని, బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా భారత్ ఆకర్షణీయ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని చెప్పారు. రూపాయిపై ఒత్తిడి మరికొంతకాలం కొనసాగొచ్చని నాగేశ్వరన్ తెలిపారు. అమెరికాతో సంబంధాల్లో సవాళ్లు, ఏఐ పెట్టుబడుల కొరత, పశ్చిమాసియా ఘర్షణలతో పెరుగుతున్న చమురు ధరలు, ప్రపంచ కేంద్ర బ్యాంకుల వడ్డీరేట్ల పెంపు భారత్‌లో మూలధన ప్రవాహాలపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు. అయితే 7 శాతానికి పైగా ఆర్థిక వృద్ధి, నియంత్రణలో ఉన్న కరెంట్ ఖాతా లోటు, పటిష్ఠమైన బ్యాంకింగ్ వ్యవస్థ, తక్కువ కార్పొరేట్ రుణభారం, దేశీయ పొదుపులు మూలధన మార్కెట్లలోకి మళ్లడం భారత్‌కు బలాలని చెప్పారు. రూపాయి విలువ సూచించే పరిస్థితితో పోలిస్తే భారత ఆర్థిక మూలాలు ప్రస్తుతం మరింత బలంగా ఉన్నాయని పేర్కొన్నారు.



జైలర్-2లోనే పార్ట్ 3కి హింట్!



టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'జైలర్ 2' ఒకటి. వరుస పరాజయాల తర్వాత సూపర్‌స్టార్ రజినీకాంత్‌కు గట్టి కమ్‌బ్యాక్ అందించిన 'జైలర్'కు సీక్వెల్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుండటంతో ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. సెన్సేషనల్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. తాజాగా సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకున్న 'జైలర్ 2' యూ/ఏ సర్టిఫికెట్ సొంతం చేసుకుంది. 2 గంటల 45 నిమిషాల నిడివితో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. విడుదల సమీపిస్తుండటంతో చిత్రబృందం ప్రమోషన్స్‌ను ముమ్మరం చేసింది. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఈ క్రమంలో 'జైలర్ 3'కు సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. 'జైలర్ 2' క్లైమాక్స్‌లో మూడో భాగానికి సంబంధించిన కీలకమైన హింట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ 'జైలర్ 3' కథాంశాన్ని రజినీకాంత్‌కు వివరించగా, సూపర్‌స్టార్ కూడా మూడో భాగంపై ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. అయితే 'జైలర్ 3' పట్టాలెక్కాలంటే 'జైలర్ 2'కు ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందన కీలకం కానుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో మూడో భాగాన్ని నిర్మించే అవకాశం ఉందని, 2028లో ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇక 'జైలర్ 2'లో సూరజ్ వెంజరమూడు, ఎస్.జే. సూర్య, విద్యాబాలన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తొలి భాగంలో అతిథి పాత్రల్లో మెరిసిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, మిథున్ చక్రవర్తి కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనుండటం సినిమా పై మరింత ఆసక్తిని పెంచుతోంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కోలీవుడ్ లేడీ నయనతార - అజయ్ జ్ఞానముత్తు కాంబో రిపీట్



సూపర్‌స్టార్ నయనతార, టాలెంటెడ్ డైరెక్టర్ అజయ్ జ్ఞానముత్తు కాంబినేషన్‌లో మరో ఆసక్తికరమైన చిత్రం తెరకెక్కనున్నట్లు సమాచారం. దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతుండటంతో కోలీవుడ్‌లో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే 2018లో నయనతార, అజయ్ జ్ఞానముత్తు కలయికలో వచ్చిన 'ఇమైక్కా నొడిగల్' బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఆ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో ఈ జోడీకి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఇప్పుడు అదే కాంబినేషన్‌ను మరోసారి రిపీట్ చేస్తూ పూర్తిగా భిన్నమైన కథాంశంతో కొత్త సినిమాను రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈసారి ఫాంటసీ, యాక్షన్ అంశాలకు ప్రాధాన్యమిస్తూ కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా భారీ యాక్షన్ ఎపిసోడ్లు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో పాటు ఫాంటసీ అంశాలను మేళవించి సినిమాను తెరకెక్కించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండ్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచేలా దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు కథను రూపొందిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

నయనతార పాత్ర కూడా ఇప్పటివరకు ఆమె చేసిన సినిమాలకు భిన్నంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కథకు తగ్గట్టుగా ఆమె పాత్రలో యాక్షన్ కోణాన్ని కూడా ప్రత్యేకంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. ఫాంటసీ ప్రపంచాన్ని సరికొత్తగా ఆవిష్కరించేలా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందించేందుకు మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో సినిమా విజువల్‌గా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుందని కోలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సోషల్ మీడియాలోనూ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు పోస్టులు వైరల్ అవుతుండటంతో నయనతార అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఇదిలా ఉండగా, ఈ భారీ చిత్రాన్ని 'పాషన్ స్టూడియోస్' బ్యానర్‌పై నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నయనతార సొంత నిర్మాణ సంస్థ 'రౌడీ పిక్చర్స్' కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామిగా చేరే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే సినిమా కథ, నటీనటులు, నిర్మాణ వివరాలు, అధికారిక ప్రకటన వంటి అంశాలపై చిత్రబృందం నుంచి ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. 'ఇమైక్కా నొడిగల్'తో ఆకట్టుకున్న నయనతార–అజయ్ జ్ఞానముత్తు జోడీ మరోసారి కలవనుందనే వార్తే ఇప్పుడు అభిమానుల్లో అంచనాలను పెంచుతోంది.

నటనా దిగ్గజం నానా పటేకర్‌కు కన్నీటి వీడ్కోలు



భారతీయ చిత్రసీమలో ఎంతోమంది నటులు ఉన్నా.. తమ వైవిధ్యమైన నటనతో పాత్రలకు ప్రాణం పోసి, ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసిన నటులు కొందరే. అలాంటి అరుదైన నటుల్లో అగ్రగణ్యుడు నానా పటేకర్. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ నటనా ప్రస్థానంలో విలన్, సైకో, భావోద్వేగభరిత పాత్రలు, సెంటిమెంట్, కామెడీ.. ఇలా ఎలాంటి పాత్రను ఎంచుకున్నా దానికి తనదైన ప్రత్యేకతను తీసుకొచ్చారు. ఆయన తెరపై కనిపిస్తే ఆ పాత్రలో మరొక నటుడిని ఊహించుకోవడం కూడా కష్టమే అన్నంతగా ప్రేక్షకులపై ప్రభావం చూపించారు. నానా పటేకర్ ఎప్పుడూ పెద్ద బ్యానర్ కోసం, తన సరసన నటించే హీరో కోసం ఎదురుచూడలేదు. కథలో బలం ఎంత ఉంది? పాత్రకు ఉన్న ప్రాధాన్యత ఏమిటి? అనే అంశాలకే ఆయన అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. కథను నమ్ముకుని, ప్రతి పాత్రలోనూ పూర్తిగా ఒదిగిపోయి కోట్లాది మంది అభిమానుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. 'పరిందా', 'క్రాంతివీర్', 'అబ్ తక్ ఛప్పన్', 'వెల్‌కమ్', 'నటసామ్రాట్' తదితర చిత్రాల్లో ఆయన ప్రదర్శించిన అభినయం భారతీయ సినిమా చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. నానా పటేకర్ ప్రత్యేకమైన సంభాషణల పలుకుబడి, కళ్లతోనే భావాలను పలికించే హావభావాలు, నటనలోని తీవ్రత ఆయనను సమకాలీన నటుల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టాయి. అందుకే నానా పటేకర్ కేవలం ఓ నటుడు మాత్రమే కాదని.. భావితరాల నటులకు ఆయన ఓ 'నటనా శిక్షణాలయం' అని పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా గుర్తు చేసుకుంటున్నారు. 75 ఏళ్ల వయసులో గోవాలో గుండెపోటుతో నానా పటేకర్ కన్నుమూశారు. ఆయన మరణవార్తతో భారతీయ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. నానా పటేకర్ ఆత్మకు శాంతి చేకూరాలని అభిమానులు, సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తూ ఆయనతో తమకున్న అనుబంధాన్ని, ఆయన అందించిన మరపురాని పాత్రలను గుర్తు చేసుకుంటున్నారు.

చుట్టమల్లే ఫేక్ వీడియోపై సీపీ సీరియస్

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ నటించిన 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లే' పాటకు సంబంధించిన మార్ఫింగ్ వీడియో విషయంలో మరో ఫేక్ న్యూస్ వైరల్ కావడంపై హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సీరియస్ అయ్యారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా రూపొందించిన చిత్రాలు, డీప్‌ఫేక్‌లను చూసి ప్రజలు మోసపోవద్దని హెచ్చరించారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయవద్దని సూచించారు. 'చుట్టమల్లే' పాటను అసభ్యంగా ఎడిట్ చేసిన ఓ పార్టీకి చెందిన నాయకుడిని హైదరాబాద్ సిటీ పోలీసులు అరెస్టు చేశారంటూ ఎక్స్ వేదికగా ఓ యూజర్ పోస్టు చేశాడు. ఈ పోస్టులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లుగా, సీపీ సజ్జనార్ కూడా అక్కడ ఉన్నట్లుగా కనిపించే ఫొటోను ఏఐ సాయంతో రూపొందించి షేర్ చేశారు. ఈ విషయం సజ్జనార్ దృష్టికి రావడంతో ఆయన స్పందిస్తూ.. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి చిత్రాలను షేర్ చేయవద్దని హెచ్చరించారు. ఏఐ ద్వారా రూపొందిస్తున్న చిత్రాలు రోజురోజుకూ మరింత వాస్తవికంగా కనిపిస్తున్న నేపథ్యంలో ఆన్‌లైన్‌లో చూసే ప్రతి విషయాన్నీ ప్రశ్నించి, దాని నిజానిజాలను నిర్ధారించుకోవడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఒక ఫొటో చూడటానికి నమ్మశక్యంగా ఉన్నంత మాత్రాన అది నిజమైనదని భావించకూడదని స్పష్టం చేశారు. ఇదే సమయంలో తన చిత్రాన్ని కొందరు అభిమానులు దుర్వినియోగం చేస్తున్న విషయాన్ని గమనించాలని కోరుతూ జూనియర్ ఎన్టీఆర్‌ను కూడా సజ్జనార్ ట్యాగ్ చేశారు.



కాళేశ్వరంపై వేణు ఉడుగుల ఆవేదన



కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులపై టాలీవుడ్ దర్శకుడు వేణు ఉడుగుల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిసరాల్లో భారీగా చెత్తాచెదారం పేరుకుపోయిన వీడియోను ఆయన షేర్ చేస్తూ.. 'మన కాళేశ్వరం దక్షిణ భారత త్రివేణి సంగమం కాదా?' అని ప్రశ్నించారు. అంతటి పవిత్రమైన ప్రదేశం దుర్వాసనతో ఒక్క క్షణం కూడా నిలబడలేని పరిస్థితిలో ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. కేవలం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోవడమే సమస్య కాదని, ఇది పరిపాలన, జవాబుదారీతనానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. భక్తి అనేది వ్యక్తిగత విషయమని, అయితే నది మాత్రం ప్రజలందరికీ చెందినదని వ్యాఖ్యానించారు. ఇది గత ప్రభుత్వాల లెక్క కాదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వ బాధ్యత అని వేణు ఉడుగుల పేర్కొన్నారు. ఆయన చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాళేశ్వరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. కాగా, వేణు ఉడుగుల 'నీది నాది ఒకే కథ' చిత్రంతో టాలీవుడ్‌కు దర్శకుడిగా పరిచయమయ్యారు. అనంతరం రానా కథానాయకుడిగా 'విరాటపర్వం' చిత్రాన్ని తెరకెక్కించి ప్రేక్షకులను అలరించారు. సినిమాలతో పాటు సామాజిక, రాజకీయ అంశాలపైనా వేణు ఉడుగుల తరచూ తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు.

పర్ణశాలగా క్రేజీ హారర్-కామెడీ

సోషల్ మీడియాలో కొంతకాలంగా విపరీతంగా ట్రెండ్ అవుతున్న క్రేజీ హారర్–కామెడీ ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్రబృందం కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన 'జిమ్ జిమ్ తార' పాట సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. రీల్స్‌తో పాటు యూట్యూబ్‌లోనూ ఈ పాటకు భారీగా స్పందన రావడంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం ఈ సినిమాకు 'పర్ణశాల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రకటిస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఎస్ఎల్‌టీ ఫిలిమ్స్ బ్యానర్‌పై మంచి వెంకట్ నిర్మాణంలో, వై.జి. భరత్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించేలా 'పర్ణశాల'ను రూపొందిస్తున్నామని చిత్రబృందం తెలిపింది. హారర్, కామెడీ అంశాలను మేళవించి ఆద్యంతం వినోదాన్ని పంచే హిలేరియస్ హారర్–కామెడీ రైడ్‌గా ఈ సినిమా ఉండబోతున్నట్లు పేర్కొంది. ఇప్పటికే 'జిమ్ జిమ్ తార' పాటకు వచ్చిన క్రేజ్‌తో మంచి బజ్ సొంతం చేసుకున్న ఈ చిత్రం.. తాజాగా టైటిల్, ఫస్ట్‌లుక్‌తో ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది.



అవకాశాలు రాకపోవడానికి కారణం అదేనా?



'కేజీఎఫ్' చిత్రంతో ఒక్కసారిగా స్టార్‌డమ్ అందుకున్న నటి శ్రీనిధి శెట్టి ప్రస్తుతం వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన శ్రీనిధి శెట్టి.. తాను తక్కువ సినిమాలు చేయడానికి గల కారణాన్ని వెల్లడించింది. గత కొన్నేళ్లుగా తక్కువ ప్రాజెక్టుల్లో కనిపించడంతో తాను చాలా సెలక్టివ్‌గా ఉంటానని అందరూ భావిస్తున్నారని, అయితే వాస్తవానికి కెమెరా ముందు నటించడం తనకు ఎంతో ఇష్టమని చెప్పింది. మంచి అవకాశాలు వస్తే ఏడాదికి నాలుగైదు సినిమాలు చేయడానికి కూడా తాను సిద్ధమేనని స్పష్టం చేసింది. అయితే తనకు సరిపోయే మంచి కథ, ఆసక్తికరమైన టీమ్ కుదిరినప్పుడే ఆయా ప్రాజెక్టులను అంగీకరిస్తానని తెలిపింది. కొన్ని సందర్భాల్లో తన సమయం కలిసి రాకపోవడం వల్ల కావచ్చు, లేదా తనను మేకర్స్ సరిగ్గా అంచనా వేయలేకపోవడం వల్ల కావచ్చు.. ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదని అభిప్రాయపడింది. తాను మంచి నటి కాదేమో.. అందుకే అవకాశాలు రావడం లేదేమో అనే ఆలోచన కూడా తనకు కలుగుతుందని శ్రీనిధి చెప్పింది. తన గురించి తాను ఎప్పుడూ గొప్పగా ఊహించుకోనని, ఎల్లప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉంటానని పేర్కొంది. కొత్త దర్శకుడైనా, పెద్ద దర్శకుడైనా తనకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతానని, సినిమాపై ఉన్న ప్యాషన్‌తో తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతానని చెప్పుకొచ్చింది. ఇక వెంకటేశ్–త్రివిక్రమ్ కలయికలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' గురించి శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. ఈ గోల్డెన్ కాంబినేషన్‌లో భాగమయ్యే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని, ఇలాంటి చిత్రంలో నటించే ఛాన్స్ రావడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.